



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

మంగళవారం,
సెప్టెంబరు 17, 2024

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




## విఘ్ననాయకుడికి వీడ్కోలు నేడు

ఖైరతాబాద్‌లో కొలువైన మహా గణపతి నుంచి..

గల్లీల్లోని గణనాథుల వరకు మంగళవారం నిమజ్జనానికి కదలనున్నారు.

గ్రేటర్‌లో 73 ప్రాంతాల్లో నిమజ్జనం

విధుల్లో 15 వేల మంది జీహెచ్‌ఎంసీ సిబ్బంది

35 వేల మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు

హైదరాబాద్: ఖైరతాబాద్‌లో కొలువైన మహా గణపతి నుంచి.. గల్లీల్లోని గణనాథుల వరకు మంగళవారం నిమజ్జనానికి కదలనున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

2లో

# రాజీవ్ విగ్రహాన్ని కూల్చడానికి ఎవడొస్తాడో రండి

### కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజం

కంప్యూటర్‌ను పరిచయం చేసింది రాజీవ్ అని తెలుసా?

అదే లేకపోతే గుంటూరులో ఇడ్లీ వడ అమ్ముకునేటోడివి

కేటీఆర్‌ను ఉద్దేశించి ముఖ్యమంత్రి ఎద్దేవా

సచివాలయం ఎదుట రాజీవ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం

నిమజ్జనంలో ఇబ్బందులు ఉండొద్దని అధికారులకు ఆదేశం



హైదరాబాద్, సెప్టెంబరు 16 : గాంధీల గురించి ఈ గాడిదలకు ఏం తెలుసు? అంటూ బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రాణ త్యాగం, పదవుల త్యాగమంటే గాంధీ కుటుంబానిదేనని చెప్పారు. అలాంటి కుటుంబ వారసుడైన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెడతామంటే.. కూలగొడతామంటున్నారని కేటీఆర్, తదితర నేతలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "బిడ్డా.. వెయ్యి ఎకరాల్లో ఫాంహౌస్ కట్టుకున్నావ్. అందులో జిల్లేళ్లు మొలిపిస్తా" అంటూ కేసీఆర్‌ను హెచ్చరించారు. 'బీఆర్ఎస్ మిడతల దండు మళ్లీ రాష్ట్రంపైకి వస్తోంది. ఆ దండును మీరు, నేను కలిసి పొలిమేరల వరకు తరిమికొడదాం' అని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసే స్థలంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెడదామనుకున్నామని అంటున్నారని, మరి పదేళ్ల పాటు పాలనలో ఉండి విగ్రహాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. అందుకే తాము రాష్ట్రానికే గుండెకాయ వంటి సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రకటన వచ్చిన, సోనియాగాంధీ జన్మదినమైన డిసెంబరు 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు. సచివాలయం ముందు ఏర్పాటు చేసిన రాజీవ్ విగ్రహాన్ని సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన బీఆర్ఎస్ పార్టీపై విరుచుకుపడ్డారు. " ఇది రాజకీయ వేదిక కాదు. కానీ, జరుగుతున్న పరిణామాలు, కొంత మంది మాట్లాడుతున్న మాటలను దృష్టిలో పెట్టుకుని, త్యాగమంటే ఏమిటో రాబోయే తరాలకు, ఈ రోజు చిల్లరమల్లరగా మాట్లాడుతున్నవారికి గుర్తు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాపై ఉంది. అడ్డగోలుగా వేల కోట్ల ఆస్తులు కూడబెట్టినవారికి గాంధీల కుటుంబ త్యాగాలు ఏం తెలుసు?" అని ప్రశ్నించారు. "ఈ రోజు ట్విటర్ పిట్ట అమెరికా వెళ్లి కంప్యూటర్ చదువుకున్నా అంటున్నడు. ఆ కంప్యూటర్‌ను ఈ దేశానికి పరిచయం చేసిందే రాజీవ్‌గాంధీ. ఆ కంప్యూటర్ లేకపోతే ఏ గుంటూరులోనో ఇడ్లీ, వడ అమ్ముకుంటూ తిరిగేటోడివి. సిద్దిపేట రైల్వే స్టేషన్‌లో చాయ్, సమోసా అమ్ముకుంటూ ఉండేటోడివి. రాజీవ్‌గాంధీ కంప్యూటర్‌ను పరిచయం చేయడం వల్లే నీ బతుక్కి ఒక కంప్యూటర్, ఒక ట్విటర్ అకౌంట్ ఉన్నాయి. ఒక ఐటీ మంత్రివి అయ్యావు. లేకపోతే ఐటీ శాఖనే ఉండేది కాదు. దేశ సమగ్రతను కాపాడిన అంతటి గొప్ప వ్యక్తి విగ్రహాన్ని సచివాలయం ముందు పెడితే, ఎందుకు పెట్టారని అడుగుతావా? అధికారం పోయినా.. మదం దిగలేదు" అని కేటీఆర్‌పై విరుచుకుపడ్డారు. "గాంధీలది కుటుంబ పాలన అంటున్నారు. కార్యకర్తలారా ఆ సన్నాసులకు చెప్పండి.. రాజీవ్‌గాంధీ చనిపోయిన తర్వాత దాదాపు 15 ఏళ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. సోనియాగాంధీ ఏ పదవీ తీసుకోలేదు. 2004 నుంచి 2014 వరకు కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం ఉన్నా.. సోనియా, రాహుల్ ఏ పదవులూ తీసుకోలేదు. పదవి, ప్రాణ త్యాగమంటే వాళ్లని చూడాలి. స్వాతంత్ర్య పోరాటమంటే ఆ కుటుంబాన్ని చూడాలి. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ప్రాణ త్యాగాలు చేసి, దళిత, గిరిజన జాతులను ఆదుకున్నారు. సోనియా, రాహుల్‌గాంధీ పదవీ త్యాగం చేసి పీవీ నర్సింహారావు, మన్మోహన్‌సింగ్ వంటి మేధావులను ప్రధానమంత్రులుగా పరిచయం చేశారు. మరి ఈ సన్నాసుల సంగతి ఏంది? అయ్య ముఖ్యమంత్రి, కొడుకు ఐటీ మంత్రి, అల్లుడు సాగునీటి పారుదల శాఖ మంత్రి, బిడ్డ ఎంపీ, సడ్డకుడి కొడుకు

# కొత్త సీఎంపై సర్వత్రా ఉత్కంఠ

ఎల్జీకి సమర్పించనున్న కేజ్రీవాల్

రోజంతా నేతలతో మల్లగుల్లాలు

నేడు ఎమ్మెల్యేల భేటీలో నిర్ణయం

ఎస్సీ, మైనారిటీ నేతల పేర్లు



న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం రాజీనామా చేయనున్నారు. సాయంత్రం 4.30కు లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆయనకు అపాయింట్‌మెంట్ ఇచ్చారు. ఆ సందర్భంగా ఎల్జీకి కేజ్రీవాల్ రాజీనామా లేఖ సమర్పిస్తారని ఆప్ మంత్రి సౌరభ్ భరద్వాజ్ సోమవారం మీడియాకు తెలిపారు. రెండు రోజుల్లో రాజీనామా చేస్తానని, ప్రజలు గెలిపించాకే తిరిగి సీఎం కుర్చీలో కూర్చుంటానని

2లో



## సగర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ నిమజ్జన యాత్రలో పాల్గొన్న వార్తమిర్రర్ సిఎండి బద్దుల శ్రీధర్ యాదవ్

### లడ్డు విజేతలకు సన్మానం చేసిన సగర సంఘం యువజన నాయకులు

సంస్థాన్ వార్త మిర్రర్ ప్రతినిధి : సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో సాగర్ కాలనీలో నగర యువజన సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన మహాగణపతి నిమజ్జన సందర్భంగా మహాగణపతిని సందర్శించిన ,వార్త మిర్రర్ బృందం, విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన, వార్త మిర్రర్ ఎడిటర్ బద్దుల శ్రీధర్ యాదవ్, బద్దుల మురళి కృష్ణ యాదవ్, జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గణేష్ సాగర్, నల్గొండ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏలే భాస్కర్, సగర సంఘం నాయకులు, రాసాల వెంకటేష్ సాగర్ ,రాసాల విజయ్ సాగర్,బలుగూరి శివ, గొల్లూరి శివ బల్గూరి ధనుంజయ, గొల్లూరి బిక్షపతి బల్గురి రాములు, ముఖేష్ వంశీ, అప్పన గోలి వంశీ, సగర సంగం నాయకులు కాలనీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# దిగొచ్చిన దీదీ

### జూడాల కీలక డిమాండ్లకు అంగీకారం

కోల్‌కతా పోలీసు కమిషనర్ గోయల్‌పై వేటు

వైద్యవిద్య డైరెక్టర్ తొలగింపు

ఆరోగ్య సేవల డైరెక్టర్ కూడా

ఎలాంటి క్రమశిక్షణ చర్యలుండవు

విధుల్లో చేరాలని వినతి

చర్చించి చెబుతామన్న జూడాలు



కోల్‌కతా: మమతా బెనర్జీ సర్కారు దిగివచ్చింది. జూనియర్ డాక్టర్ల ఐదు డిమాండ్లలో మూడింటిని ఆమోదించింది. వైద్య విద్య డైరెక్టర్, ఆరోగ్య సేవల డైరెక్టర్లను తొలగించడానికి అంగీకరించింది.

2లో

# జానీ మాస్టర్‌పై లైంగిక వేధింపుల కేసు

తనపై పలుమార్లు వేధింపులకు పాల్పడ్డాడని సహాయకురాలి ఫిర్యాదు

మతం మార్చుకుని పెళ్లి చేసుకోవాల్సిందిగా బెదిరించాడని ఫిర్యాదులో పేర్కొన్న బాధితురాలు

కేసు నమోదు చేసిన పోలీసులు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని జనసేన ఆదేశం



# నేడు కేంద్రం ఆధ్వర్యంలో 'విమోచనం'

సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న కేంద్ర సాంస్కృతికశాఖ

ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్: సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం మంగళవారం అధికారికంగా హైదరాబాద్ విమోచన దినోత్సవం నిర్వహిస్తోంది. ఉదయం 7.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలుంటాయి. తెలంగాణతోపాటు కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన కళాకారుల ప్రదర్శనలు నిర్వహిస్తారు. 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా'ద్వారా 'సెప్టెంబర్ 17%-%హైదరాబాద్ విమోచన దినం'ప్రాధాన్యత వివరించేలా సంక్షిప్త ప్రదర్శన ఉంటుంది.

# విఘ్ననాయకుడికి వీడ్కోలు నేడు

(మొదటి పేజీ తరువాయి)

హుస్సేన్ సాగర్‌తో పాటు సరూర్‌నగర్, కాప్రా తదితర ప్రాంతాల్లోని పెద్ద, చిన్న చెరువులు, పోర్టబుల్ పాండ్స్‌తో కలిపి 73 ప్రాంతాల్లో నిమజ్జనం చేయనున్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ, ఇతర పనులకు 160 గణేష్ యాక్షన్ టీంలను జీహెచ్ఎంసీ రంగంలోకి దింపింది. వివిధ విభాగాలకు చెందిన 15 వేల మంది సిబ్బంది విధుల్లో ఉండనున్నారు. హైదరాబాద్ సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో 35 వేల మందిపైగా పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. హుస్సేన్‌సాగర్ తీరంలోనే 3 వేల మంది సిబ్బంది అందుబాటులో ఉంటారని పోలీస్ శాఖ వర్గాలు పేర్కొన్నాయి. శోభాయాత్ర మార్గాల్లో విద్యుత్తు లైన్లు అడ్డు రాకుండా, సరఫరాలో అంతరాయం కలిగితే తక్షణమే పునరుద్ధరించేలా టీజీఎసపీడీసీఎల్ సిబ్బందిని రంగంలోకి దింపింది. ఎన్టీఆర్ మార్గ్, ట్యాంక్‌బండ్ వద్ద 8, పెద్ద చెరువుల వద్ద మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉంచారు. ప్రధాన నిమజ్జన ప్రాంతాల్లో మరుగుదొడ్లు, వాటర్ క్యాంప్‌లు, వైద్య శిబిరాలు, కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. బాలాపూర్ నుంచి హుస్సేన్ సాగర్ తీరం వరకు 18 కి.మీ. మేర ప్రధాన శోభాయాత్ర సాగనుంది. వేర్వేరు ప్రాంతాల నుంచి గణనా?థుల ఊరేగింపు జరిగే మార్గాలు 300 కి.మీ. పైగా ఉన్నాయి. పారిశుధ్య నిర్వహణకు 3, 4 కి.మీలకు ఒకటి చొప్పున గణేష్ యాక్షన్ టీంలు ఉంటాయి. ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, సంజీవయ్య పార్కు, బేబి పాండ్‌ల వద్ద 38 క్రేన్లు ఉన్నాయని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు. నిమజ్జన ప్రక్రియకు ఆటంకం లేకుండా సాగర్ తీరం చుట్టూ పోలీసులు బారికేడ్లు పెట్టారు. అదనంగా 733 సీసీ కెమెరాలు బిగించారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ప్రత్యేక ఐటీ బృందం శోభాయాత్రను పర్యవేక్షించనుంది. నిమజ్జన ఊరేగింపులో రంగురంగుల పేపర్లు చల్లొద్దని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కోరారు.

# కొత్త సీఎంపై సర్వత్రా ఉత్కంఠ

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీ అసెంబ్లీకి నవంబర్లోనే ముందస్తు ఎన్నికలు పెట్టాలని కూడా ఆ సందర్భంగా ఆయన ఈసీని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం రోజంతా ఆప్ నేతలతో కేజ్రీ సుదీర్ఘంగా మంతనాలు జరిపారు. తన ప్రకటనపై స్పందన ఎలా ఉందని పార్టీ అత్యున్నత నిర్ణాయక విభాగమైన రాజకీయ వ్యవహారాల కమిటీ భేటీలో ఆరా తీశారు. సీఎం అభ్యర్థిపై ఒక్కక్కరి నుంచీ వ్యక్తిగతంగా అభిప్రాయాలు సేకరించారు. అంతకుముందు ఉదయం కీలక నేతలు మనీశ్ సిసోడియా, రాఘవ్ ఛద్దా తదితరులతోనూ ఈ అంశంపై లోతుగా చర్చలు జరిపారు. సీఎం పదవికి మంత్రులు ఆతిశి, గోపాల్ రాయ్, కైలాశ్ గహ్లోత్, సౌరభ్ భరద్వాజ్ తదితరుల పేర్లు గట్టిగా వినిపిస్తున్నాయి. వీరితో పాటు స్పీకర్ రాంనివాస్ గోయల్, కేజ్రీవాల్ భార్య సునీత పేర్లపైనా లోతుగా చర్చ జరుగుతున్నట్టు ఆప్ వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీలో 12 ఎస్సీ రిజర్వుడు శాసనసభ స్థానాలున్నాయి. కనీసం మరో ఆరు స్థానాల్లో మైనారిటీలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎస్సీ, లేదా మైనారిటీ నేతకు చాన్స్ దక్కొచ్చన్న వాదనా ఉంది. దాంతో ఎస్సీ, మైనారిటీ వర్గానికి చెందిన పలువురు ఆప్ ఎమ్మెల్యేల పేర్లు కూడా కొత్తగా తెరపైకి వస్తున్నాయి! మంగళవారం కేజ్రీవాల్ రాజీనామాకు ముందు ఉదయం 11.30కు ఆప్ లెజిస్లేటివ్ పార్టీ సమావేశం జరగనుంది. సీఎం అభ్యర్థిపై ఈ భేటీలో తుది నిర్ణయం తీసుకుంటారని చెబుతున్నారు. మైనారిటీ వర్గానికి చెందిన ఆప్ ఎమ్మెల్యే ఇమ్రాన్ హుసేన్ పేరు ఖరారైనా ఆశ్చర్యం లేదని ఆప్ ముఖ్య నేత ఒకరు చెప్పడం విశేషం!

**హరియాణాలో సుడిగాలి ప్రచారం!**

రాజీనామా అనంతరం కేజ్రీవాల్ హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో సుడిగాలి ప్రచారం చేస్తారని ఆప్ వర్గాలు చెబుతున్నాయి. హరియాణలో అక్టోబర్ 5న పోలింగ్ జరగనుంది. అక్కడ కాంగ్రెస్‌తో ఆప్ పొత్తు పెట్టుకోలేదు. మొత్తం 90 స్థానాల్లో ఒంటరిగానే అభ్యర్థులను బరిలోకి దింపింది. జమ్మూకశ్మీర్‌లో కూడా కేజ్రీవాల్ ప్రచారం చేస్తారని సమాచారం.

# దిగొచ్చిన దీదీ

(మొదటి పేజీ తరువాయి)

వైద్యురాలి తల్లిదండ్రులకు డబ్బు ఇవ్వజూపారని ఆరోపణలు ఎదుర్కొంటున్న కోల్‌కతా పోలీసు కమిషనర్ వినీత్ గోయల్ పైనా వేటు వేసింది. మంగళవారం కొత్త కమిషనర్‌ను నియమిస్తామని సీఎం మమత ప్రకటించారు. వినీత్ గోయల్ కమిషనర్‌గా కొనసాగడానికి సుముఖంగా లేరన్నారు. డిప్యూటీ పోలీస్ కమిషనర్ (నార్త్)ను తొలగించాలని నిర్ణయించామన్నారు. జూనియర్ల డాక్టర్ల ఇతర డిమాండ్లను పరిశీలించడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో కమిటీ వేస్తున్నట్లు తెలిపారు. ఐదింటిలో మూడు డిమాండ్లను అంగీకరించినందుకు సమ్మె విరమించి విధులకు హాజరు కావాలని జూనియర్ డాక్టర్లను కోరినట్లు మమత వెల్లడించారు. సోమవారం రాత్రి 12 గంటల తర్వాత మమత మీడియాతో మాట్లాడుతూ సమావేశపు వివరాలను వెల్లడించారు. 42 మంది జూనియర్ డాక్టర్లు, బెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్ సమావేశపు మినిట్స్‌పై సంతకాలు చేశారని మమత తెలిపారు. జూడాలపై ఎలాంటి క్రమశిక్షణ చర్యలు ఉండవని ప్రకటించారు. చర్చించుకొని తమ నిర్ణయం చెబుతామని జూనియర్ డాక్టర్లు తెలిపారని మమత వెల్లడించారు. రోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని విధులకు హాజరుకావాలని విజ్ఞప్తి చేశానన్నారు. ఆరోగ్యశాఖ కార్యదర్శిని కూడా బదిలీ చేయాలనేది జూడాల డిమాండ్లలో ఒకటి. కాళిఘాట్‌లోని సీఎం నివాసంలో సోమవారం జూనియర్ డాక్టర్లతో రాత్రి 7 గంటలకు మొదలైన చర్చలు 9 దాకా కొనసాగాయి. 42 మంది జూడాలు మమతా బెనర్జీతో సమావేశమయ్యారు. తమ డిమాండ్లను లిఖితపూర్వకంగా సీఎం ముందుంచారు. అనంతరం ఇరుపక్షాలు రెండున్నర గంటల పాటు సమావేశపు మినిట్స్‌కు తుదిరూపునిచ్చాయి. చర్చలు సానుకూలంగా జరిగాయని మమత అన్నారు. అందుకే ఇరుపక్షాలు మినిట్స్‌పై సంతకాలు చేశాయని అభిప్రాయపడ్డారు. అంతకుముందు సోమవారం ఉదయం మమత సర్కారు జూనియర్ డాక్టర్లను చర్చలకు ఆహ్వానించింది. చర్చలకు పిలవడం ఇది ఐదో, ఆఖరుసారని కూడా స్పష్టం చేసింది.

**నేడు సుప్రీం విచారణ**

న్యూఢిల్లీ: ఆర్.జి.కర్ ఆసుపత్రి వైద్యురాలి హత్యాచారం ఘటనను సుమోటోగా తీసుకున్న సుప్రీంకోర్టు మంగళవారం ఈ కేసును మరోసారి విచారించనుంది. సహచర డాక్టర్ పాశవిక హత్యను నిరసిస్తూ ఆగస్టు 9 నుంచి పశ్చిమబెంగాల్ జూనియర్ డాక్టర్లు విధులను బహిష్కరిస్తున్నారు. క్రమశిక్షణ చర్యల బారినపడకుండా ఉండాలంటే సెప్టెంబరు 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా విధుల్లో చేరాలని సుప్రీంకోర్టు గతంలో జూడాలను ఆదేశించింది. కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ జూడాలను సమ్మె కొనసాగించారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు మంగళవారం జరిపే విచారణ ప్రాధాన్యత సంతరించుకుంది.

# వనస్థలిపురం అతిథి రెస్టారెంట్ "సాక్షి"గా

# బిర్యానీలో కోడి "ఈ"కలు!!

- ఇదేమని ప్రశ్నించిన కస్టమర్ కు అతిథి రెస్టారెంట్ నిర్వాహకుల బెదిరింపులు
- మమ్మల్ని ఎవ్వరు ఏమి చేయలేరు- నీ దిక్కున్న చోట చెప్పుకో పో......
- ఓ మహిళా కస్టమర్ కు నిర్వాహకుల బెదిరింపులు
- జిహెచ్ఎంసి ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు, తనిఖీలు చేసిన అధికారులు








ఎల్బీనగర్ 16 సెప్టెంబర్ : ఎల్బీనగర్ నియోజకవర్గం వనస్థలిపురం అతిథి రెస్టారెంట్ నిర్వాకహము మరో మారు సోమవారం బట్టబయలు అయింది. వనస్థలిపురం అతిథి రెస్టారెంట్ "సాక్షి"గా బిర్యానీలో కోడి ''ఈ''కలు......!!. వనస్థలిపురం సచివాలయనగర్ అతిథి రెస్టారెంట్ బిర్యానీలో చికెన్ లెగ్ ముక్కలకు కోడి ఈకలు దర్శనమిచ్చాయి. ఈ హఠాత్పరిణామంతో కంగు తిన్న కస్టమర్ రెస్టారెంట్ నిర్వాహకులను ఇదేమిటని నిలదీశారు. దీంతో అతిథి రెస్టారెంట్ నిర్వాహకులు మహిళా కస్టమర్ పై జులుం ప్రదర్శించారు. మమ్మల్ని ఎవ్వరు ఏమి చేయలేరు– నీదిక్కున చోట చెప్పుకో పో...అనీ ఓ మహిళా కస్టమర్ కు నిర్వాహకుల బెదిరింపులకు పాల్పడ్డారని బాధితురాలు మీడియా ముందు వాపోయింది. వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోనీ సచివాలయ నగర్ అతిథి రెస్టారెంట్ లో జరిగిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనకు సంబంధించి బాధితురాలి కథనం, విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు...... ఎల్బీనగర్ నియోజకవర్గం హయత్ నగర్ కు చెందిన మేఘన తన కుటుంబ సభ్యుడితో (అన్నయ్య) కలిసి వనస్థలిపురం సచివాలయం నగర్ లోని అతిథి బిర్యాని సెంటర్ కు వెళ్ళింది. అనంతరం చికెన్ బిర్యాని ఆర్డర్ చేశారు. కొద్ది సేపటి తర్వాత బిర్యాని తీసుకు వచ్చిన రెస్టారెంట్ నిర్వాహకులు బిర్యానిలో చికెన్ లెగ్ ముక్కలకు కోడి ఈకలు రావడంతో కంగు తిన్న మొఘన యజమాని నిలదీసింది. తాము ఎంతో దూరం నుంచి అతిథి బిర్యాని సెంటర్ కు బిర్యానీ తినడానికి వస్తే కనీస జాగ్రత్తలు పాటించ కుండా కోడి ఈకలు, సరిగ్గా ఉడకని చికెన్ తో తమ ప్రాణాలు తీస్తారంటూ ఆమె ప్రశ్నించింది. ఈ హఠాత్పరిణామంతో కంగుతిన్న అతిథి బిర్యాని రెస్టారెంట్ నిర్వాహకులు కస్టమర్ల ముందు తమ రెస్టారెంట్ యొక్క బాగోతం ఎక్కడ బయట పడుతుందోనని ఏకంగా ప్రశ్నించిన కస్టమర్ మేఘనపైనే నిరుచుక పడ్డారని ఆమె వాపోయింది. జరిగిన తప్పిదానికి రెస్టారెంట్ నిర్వాహకులు పశ్చాత్తాపం వ్యక్తం చేయకుండా బెదిరింపులకు పాల్పడం ఎంత వరకు సమంజసం అని ఆమె ప్రశ్నించింది. అతిథి బిర్యాని రెస్టారెంట్ లో ఏమాత్రం కనీస భద్రతా చర్యలు, పరిశుభ్రత పాటించ కుండా రెస్టారెంట్ కు వచ్చిన కస్టమర్లపైనే బెదిరింపులకు పాల్పడటం నేడు చిన్న అంశంగా మారింది. బిర్యానీలో కోడి ఈకలు వచ్చాయని ప్రశ్నించిన తనను బెదిరింపులకు పాల్పడ్డమే కాకుండా సరైన సమాధానం చెప్పకుండా మీరు చదువుకున్న వారేనని కస్టమర్ మేఘనపై ఎదురుదాడి చేశారని, మీరు ఏమి చేసుకుంటారో చేసుకోండి మాకు కూడా పెద్దలతో పరిచయాలు ఉన్నాయని, తమని ఎవరు ఏమి చేయలేరని దుర్భాషలతో అతిథి రెస్టారెంట్ యాజమాన్యం సమాధానం ఇచ్చారని ఆమె మీడియా ముందు తన గోడు వెళ్ళబోసుకుంది. అతిథి బిర్యాని సెంటర్ నిర్వాకం సామాజిక మాధ్యమాల్లో బట్టబయలు కావడంతో జిహెచ్ఎంసి ఫుడ్ సేఫ్టీ అధికారులు బిర్యాని సెంటర్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సంఘటనపై పోలీసులు, జిహెచ్ఎంసి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూద్దాం.....!!

# ప్రభుత్వ స్కూలు పిల్లలపై ఎందుకీ వివక్ష?

(మొదటి పేజీ తరువాయి)

సీబీఎస్ఈ బోధన రద్దు ద్వారా నాణ్యమైన విద్యకు గండికొడుతున్నారంటూ ధ్వజమెత్తారు. ప్రభుత్వ పాఠుశాలల్లో చదువుతున్న పేద విద్యాఋర్థుల భవితను అంధకారంలోకి నెట్టేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలను 'ఎక్స్' వేదికగా వైఎస్ జగన్ నిలదీశారు. సోమవారం ఎక్స్‌లో చేసిన పోస్టులో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే.."ముఖ్యమంత్రిగా మీరు, విద్యాశాఖ మంత్రిగా మీ కుమారుడు తిరోగమన నిర్ణయాలతో ప్రభుత్వ స్కూళ్లను మళ్లీ మొదటికే తీసుకెళ్తున్నారు. మీ ఇళ్లల్లో పిల్లలకు అత్యుత్తమ చదువులు అందించాలనుకుంటారు కానీ, గవర్నమెంటు స్కూలు పిల్లల విషయంలో వివక్ష ఎందుకు? వాళ్లు ఎప్పటికీ కింద స్థాయిలోనే ఉండిపోవాలా? వారి జీవితాలకు మీరు శాపంపెట్టిన మాదిరిగా ఈ నిర్ణయాలు ఏంటి?గవర్నమెంటు స్కూళ్ల రూపురేఖలు మార్చే కార్యక్రమాలను రద్దు చేయడం ఎంతవరకు సమంజసం? ముఖ్యమంత్రిగా మీ 14 ఏళ్ల కాలంలో చేయలేని పనులన్నీ ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసింది. నాడు%-%నేడు, ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ, ఐబీవైపు అడుగులు, టోఫెల్, సబ్జెక్టు టీచర్ల కాన్సెప్ట్, తరగతి గదుల్లో 6వ తరగతి నుంచి ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానల్స్, 8వ తరగతి వచ్చే సరికే ట్యాబుల పంపిణీ, విద్యాకానుక, రోజుకో మెనూతో గోరుముద్ద.. ఇలా పేద పిల్లల తలరాతలను మార్చే చదువులను అందించడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను తీసుకువచ్చింది.

మీ హయాంలో ఇప్పుడు ఒక్కొక్కటిగా వీటిని రద్దుచేస్తూ వస్తున్నారు. గవర్నమెంటు స్కూళ్ల పిల్లలను ప్రైవేటు బాట పట్టించడానికి మీరు, మీ కుమారుడు కుట్రను అమలు చేస్తున్నారు. మీ పార్టీ నాయకులకు చెందిన ప్రైవేటు స్కూళ్లు బాగుండాలి? గవర్నమెంటు స్కూళ్లు నిర్వీర్యం అయిపోవాలి? మీ ఉద్దేశం అదేగా? తమ పిల్లలకు మంచి చదువులు అందించడం కోసం తల్లిదండ్రులు వారి సొంత జేబు నుంచి ఎందుకు ఖర్చుచేయాలి? అలాంటప్పుడు ఇక ప్రభుత్వాలు ఎందుకు? గవర్నమెంటు స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియంను వ్యతిరేకిస్తూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మీరు, ఈ "ఈనాడు" కోర్టులకు వెళ్లి అడ్డుకున్న తీరును ఇప్పటికీ ప్రజల మరిచిపోలేరు. మన గవర్నమెంటు స్కూలు పిల్లలు, అందులో పనిచేస్తున్న ఉపాధ్యాయులు దేనిలోనూ తక్కువ కాదు చంద్రబాబూ. వీళ్లంతా తెలివైన వారు. పైగా ప్రభుత్వ టీచర్లు లక్షల మంది పోటీపడే పరీక్షల్లో ఉత్తీర్ణులై, చక్కటి శిక్షణ కూడా పొందినవారు. ప్రైవేటు స్కూళ్లలో ఉన్నవారి కంటే గొప్ప చదువులు చదివినవారు, గొప్పగా చదువులు చెప్పగలిగినవారు. అలాంటివారిని తక్కువగా చూసే మీ మనస్తత్వాన్ని ముందు మార్చుకోండి. పిల్లలకు కావాల్సింది వారిలో ఆత్మవిశ్వాసం నింపడం, సరైన శిక్షణ, పటిష్ట బోధన. టీచర్లకు అందించాల్సింది ప్రేరణ, ప్రోత్సాహం, ఓరియంటేషన్. గడచిన ఐదేళ్లలో ఈ దిశగా వారు ఎంతో ప్రయాణంచేశారు. మళ్లీ ఇప్పుడు వారిని నిరుత్సాహపరిచి, ఉద్దేశపూర్వకంగా ఎందుకు దెబ్బతీస్తున్నారు చంద్రబాబూ?

**చదువుతోనే పేదరికం దూరం**

పేదరికాన్ని శాశ్వతంగా నిర్మూలించే ఆయుధం చదువు మాత్రమే. వెంటనే ప్రభుత్వ స్కూళ్లను నిర్వీర్యంచేసే తప్పుడు పనులు మానుకోండి. మేం తీసుకొచ్చిన సంస్కరణలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లండి. గవర్నమెంటు స్కూళ్ల పిల్లలు ప్రపంచస్థాయి చదువులను చదువుకునే అవకాశాలను దెబ్బతీయకండి. లేదంటే మీరు పేదప్రజల వ్యతిరేకులుగా, చరిత్రహీనులుగా మిగిలిపోతారు" అని చంద్రబాబు విధానాలను ఎండగట్టారు.



# నేడు కేంద్రం ఆధ్వర్యంలో 'విమోచనం'

ఉదయం 8.30 నుంచి 9 గంటల వరకు పోలీసు బలగాలు, సైనికదళాల పరేడ్ ఉంటుంది. 9 గంటలకు కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, గజేంద్రసింగ్ చౌహాన్, బండి సంజయ్ పరేడ్ గ్రౌండ్స్‌లోని యుద్ధస్మారకం వద్ద నివాళులర్పిస్తారు. ఉదయం 9.15 గంటలకు జి.కిషన్‌రెడ్డి జాతీయపతాకాన్ని ఎగురవేస్తారు. కేంద్ర మంత్రులు సర్దార్ వల్లబాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటిస్తారు. 9.20 గంటలకు కేంద్ర సాయుధ బలగాల నుంచి కిషన్‌రెడ్డి గౌరవవందనం స్వీకరిస్తారు. అనంతరం 700 మందికిపైగా కళాకారులు మంగళవాద్యం, బతుకమ్మ, కొమ్ముకోయ, బోనాలు%-%పోతరాజు, డప్పులు, కోలాటం, లంబాడీ, గుస్సాడి, ఒగ్గు కథ తదితరాలను ప్రదర్శిస్తారు. చివరగా 'హైద రాబాద్ విమోచన దినం శకటం ప్రదర్శన ఉంటుంది. 10.10 గంటలకు కేంద్ర సాంస్కృతిక శాఖ సంయుక్త కార్యదర్శి ఉమా నందూరి స్వాగతోపన్యాసం చేస్తారు. తర్వాత బండి సంజయ్ ప్రసంగిస్తారు. రాష్ట్రం నుంచి పద్మ అవార్డులకు ఎంపికైన ఆరుగురిని సన్మానిస్తారు. 10.30 గంటలకు కిషన్‌రెడ్డి ప్రసంగిస్తారు. అనంతరం కేంద్ర సమాచార శాఖ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జి బిషన్‌ను కేంద్రమంత్రులు తిలకిస్తారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్యనేతలు పాల్గొననున్నారు.



## గ్రామాల్లో రజకులకు ఎకర భూమి కేటాయించాలి - గోపి రజక

### తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి

### నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి - సి.అశోక్

వికారాబాద్,సెప్టెంబర్ 16 (వార్త మిర్రర్):

వికారాబాద్ జిల్లా కోడంగల్ నియోజకవర్గం రుద్రారంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సి అశోక్ ,జిల్లా సంయుక్త కార్యదర్శి సి. వెంకటయ్య ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటుచేసిన రుద్రారం రజక సంఘం సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక అన్నారం సాయిలు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడుతూ గ్రామాల్లో ఉతకడానికి సుదూర ప్రాంతాలకు ఒంటరి మహిళ పోవడం వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. ఉతకడానికి చెరువులు, కుంటలు, బావులు లేక ఉతకడానికి ఇబ్బంది కలుగుతున్నాయి కావున ప్రతి గ్రామంలో ఒక ఎకరా భూమి కేటాయించి అందులో బోర్ వేసి ధోబి ఘాట్, కమ్యూనిటీ హాల్ మరియు ఫంక్షన్ హాల్ కు బడ్జెట్ కేటాయించి నిర్మించాలని ప్రభుత్వాన్ని వారు కోరారు. దాదాపుగా 12 గంటలు వృత్తి చేస్తున్న రజక వృత్తిదారులను కార్మికులకు గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సి .అశోక్ మాట్లాడుతూ గ్రామాల్లో చదువుకున్న యువత అటు ఉద్యోగం లేక ఉపాధి అవకాశాలు లేక కుటుంబానికి భారం అవుతున్నారని తెచ్చిన అప్పులు కట్టలేక వలసలు వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున వారికి మెగా డీఎస్సీ వేసి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అదేవిధంగా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వారన్నారు. కార్యక్రమంలో నారాయణ ,బసప్ప, గోపాల్,బాల్ రాజ్, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు



## వనస్థలిపురం సచివాలయ నగర్ లో డీ టౌన్ బిర్యాని సెంటర్ ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

ఎల్బీనగర్,16 సెప్టెంబర్

వనస్థలిపురం పరిసర ప్రాంతాల ప్రజలకు చక్కటి ఆహారాన్ని అందించడానికి అన్ని రకాల రుచులతో కూడిన డి టౌన్ బిర్యాని సెంటర్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు తెలిపారు. వనస్థలిపురం సచివాలయ నగర్ కాలనీ ప్రధాన రహదారిలో కొత్తగా ఏర్పాటు చేసిన డీ బిర్యాని సెంటర్ ను ప్రారంభోత్సవానికి మైనంపల్లి హనుమంతరావు ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బెన కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ తనకు అత్యంత సన్నిహితుడు, సోదర సమానుడైన దత్తు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఇలాంటి బిర్యాని సెంటర్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఈ ప్రాంత ప్రజలు ఆదరభిమానాలు పొందే విధంగా రుచికరమైన ఆహారాన్ని అందించాలని సూచించారు.ఈ ప్రారంభోత్సవంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న రామ్మోహన్ గౌడ్, బిజెపి నాయకుడు కుంట్లూరు వెంకటేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ ఉమా శ్రీనివాస్, నక్క ప్రభాకర్ గౌడ్, కపిల్ రాజ్, కె. అమర్నాథ్ రెడ్డి, గుండా నిరంజన్, వాల్మీకి, సత్య, దూసరి అరుణ్ గౌడ్, మణికంఠ,సాయి, అలెక్స్,సుమిత్రన్ తదితరులు పాల్గొన్నారు. డి టౌన్ బిర్యానీ సెంటర్ యజమాని దత్తు మైనంపల్లి హనుమంతరావు తో పాటు ప్రారంభోత్సవానికి హాజరైన అతిథులకు స్వాగతం పలికి శాలువాతో ఘనంగా సత్కరించారు.



## పోటా పోటీగా గణేష్ లడ్డూ వేలం పాటలు

మందమర్రి సెప్టెంబర్ 17: వార్త మిర్రర్ ప్రతినిధి

పట్టణంలో ప్రతిష్టించిన గణేష్ మండపాలలో నవరాత్రి పూజలు అందుకున్న గణేష్ చేతిలోని లడ్డు,కలశం, వస్త్రాలు, ఇతర పూజ సామాగ్రి వేలం పాటలు సోమవారం పోటా పోటీగా సాగాయి. పట్టణం మండలం వ్యాప్తంగా సుమారు 300 మండపాలను ప్రతిష్టించగా అయా మండపాలలో వేలంపాటల పోటీ నెలకొనగా లడ్డు,కలశం దక్కించుకునేందుకు భక్తులు పోటాపోటీగా వేలంపాటలో పాల్గొని దక్కించుకున్నారు. వేలం పాటలతో ఆయా గణేష్ మండపాలు భక్తులతో సందడిగా మారాయి. కాగా లడ్డు,కలశం తదితర పూజా సామాగ్రి దక్కించుకున్న భక్తులు మేళ తాళాలతో మంగళ హారతులతో లడ్డు కళాశాలను తమ ఇంటికి తీసుకెళ్లడం విశేషం. ఏదేమైనప్పటికీ నవరాత్రి పూజలు అందుకున్న లడ్డు కలశం పూజ సామాగ్రి కీ వేలం పాటలతో భారీ డిమాండ్ నెలకొంది.



## పాలజ్ కర్ర గణపతిని సందర్శించిన కోరుట్ల ఆర్యవైశ్య గణేష్ సభ్యులు.

కోరుట్ల వార్త మిర్రర్ ప్రతినిధి, సెప్టెంబర్ 16.

ఆదివారం రోజున మహారాష్ట్ర రాష్ట్రంలోని నాందేడ్ జిల్లాలో గల పాలజ్ కర్ర గణపతిని కోరుట్ల పట్టణానికి చెందిన ఆర్యవైశ్య గణేశ సంఘ సభ్యులు దర్శనం చేసుకున్నారు అలాగే మాటేగావ్ గ్రామంలో గల కొరడీ గణపతి,ఔదాపూర్ గ్రామం లోని మోక్ష కర్ర గణపతి,కదిలే పాప హరేశ్వర దేవాలయాలను కూడా సందర్శించుకోడం జరిగింది.ఈ యాత్రలో గణేశ సంఘ సభ్యులు అల్లాడి మహేష్,మోటూరి ప్రవీణ్ కుమార్,ముక్క రాంప్రసాద్,నూనె నవీన్ ,కొత్త సురేష్,మోటూరి రమేష్, పడిగలపవన్ ,శ్రీపతి పరమేష్, బచ్చు గంగారం,కొత్త వాసు,నీలి నవీన్,చౌడారపు హరి శ్రీనిల్,మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## భీమయ్య సగర చిరస్మరణీయుడు సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి సగర జాతికి వెలకట్టలేని సేవలందించిన గిన్నె భీమయ్య సగర చిరస్మరణీయుడు అని తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర అన్నారు. తెలంగాణ సగర సంఘం రాష్ట్ర కమిటీ, శ్రీ యాదాద్రి భగీరథ సగర ఉప్పర అన్నదాన సత్ర కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల అకాల మరణం చెందిన గిన్నె భీమయ్య సగర సంస్మరణ సభను సోమవారం గచ్చిబౌలిలోని రాష్ట్ర సగర సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భీమయ్య సగర చిత్రపటానికి పూలమాలలు వేసి సగర సంఘం రాష్ట్ర నాయకులు, జిల్లాల నాయకులు, అన్నదాన సత్రం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గిన్నె భీమయ్య సగర సేవలను స్మరించుకొని సంఘం నాయకులు మాట్లాడారు. రాష్ట్ర సగర సంఘం అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా సగర కులానికి అనేక హోదాలలో సేవలందించిన గిన్నె భీమయ్య సగర లేని లోటు సగరులకు తీరనిది అని అన్నారు. జగద్గిరిగుట్ట సగర సంఘం వ్యవస్థాపకుల్లో ఒకరైన గిన్నె భీమయ్య సగర ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కోశాధికారిగా, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పనిచేయడం, శ్రీశైల అన్నదాన సత్రం అభివృద్ధికి కృషి చేయడంతో పాటు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రాంతంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రిలో సగర అన్నదాన సత్ర నిర్మాణానికి సంకల్పించి వ్యవస్థాపక అధ్యక్షులుగా చేసిన కృషి మరువలేనిదని అన్నారు. గిన్నె భీమయ్య సగర కులానికి చేసిన సేవలు నేడు సగర కుల నాయకులకు ఆదర్శమని కొనియాడారు. భీమయ్య సగర ఆశయ సాధన కోసం భవిష్యత్తులో సగర కులాన్ని సంఘటిత పరిచి ఉన్నత శిఖరాల వైపు తీసుకుపోయే ప్రయత్నం ప్రతి ఒక్కరు చేయాలని పిలుపునిచ్చారు. గిన్నె భీమయ్య సగర స్మారకార్థం యాదాద్రిలో నిర్మాణంలో ఉన్న అన్నదాన సత్రంలో చిరస్థాయిగా ఉండే వ్యవస్థను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర మాజీ అధ్యక్షులు బంగారు నరసింహ సగర మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా కుటుంబం కంటే సగర కులానికే అధిక సమయం కేటాయించిన గొప్ప నాయకుడు గిన్నె భీమయ్య సగర అని కొనియాడారు. యాదాద్రి సగర అన్నదాన సత్ర సంఘం అధ్యక్షులు కే పి రాములు సగర మాట్లాడుతూ తన మదిలో నుంచి వచ్చిన యాదాద్రి సత్రం నిర్మాణం తొందరలోనే పూర్తి చేసి ఆయన కన్న కలలు నిజం చేస్తామని తెలిపారు. రాష్ట్ర సంఘం ముఖ్య సలహాదారులు ఆర్.బి ఆంజనేయులు సగర మాట్లాడుతూ గొప్ప వ్యక్తిత్వంతో పాటు సంఘ సేవలో ముందున్న భీమయ్య సగర అనేకమందికి స్పూర్తిదాయకమని అన్నారు. యాదాద్రి సగర అన్నదాన సత్రం అధ్యక్షులు కె.పి రాములు సగర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భీమయ్య సగర కుటుంబ సభ్యులతో పాటు సగర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర, రాష్ట్ర కోశాధికారి వడ్లకొండ కుమార స్వామి సగర, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంఘ నాయకులు డాక్టర్ గిడ్డన్న సగర,గ్రేటర్ హైదరాబాద్ సగర సంఘం అధ్యక్షులు మోడల రవి సగర, రాష్ట్ర ఉపాధ్యక్షులు పెద్ద బుద్ధుల సతీష్ సగర, చిలుక శ్రీనివాస్ సగర, శేఖర్ సగర, మోడల్ ఆంజనేయులు సగర, వెంకటయ్య సగర, బుడ్డన్న సగర, సంయుక్త కార్యదర్శి సంగిశెట్టి గంగాధర్ సగర, శ్రీనివాస్ సగర, అర్జున్ సగర, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ఆవుల వెంకట్ రాములు సగర, కోశాధికారి దిండి రామస్వామి సగర, యువజన సంఘం గ్రేటర్ అధ్యక్షులు సీతారాం సగర, గ్రేటర్ నాయకులు శ్రీరాములు సగర, రామకృష్ణ సగర, యాదాద్రి అన్నదాన సత్రం కోశాధికారి, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మాదంశెట్టి కృష్ణ సగర, యాదాద్రి జిల్లా అధ్యక్షులు నరసింహ సగర, అంజయ్య నగర్ సంఘం అధ్యక్షులు నరసింహ సగర, జగద్గిరిగుట్ట సగర సంఘం అధ్యక్షులు కొండయ్య సగర, రాష్ట్ర సంఘం నాయకులతో పాటు వివిధ జిల్లాల నాయకులు ప్రాంతీయ సంఘాల నాయకులు యాదాద్రి సత్రం దాతలు పెద్ద సంఖ్యలు హాజరయ్యారు.

## ప్రభుత్వాలు మారినా గ్రామ పంచాయతీ సిబ్బంది యొక్క తల రాతలు మారడం లేదు

### సిఐటియు జగిత్యాల జిల్లా కమిటీ కార్యదర్శి పులి మల్లేశం



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 16

తెలంగాణ లో ఎన్నికల సమయములో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామ పంచాయతీ సిబ్బంది యొక్క సమస్యలు పరిష్కారం చేస్తామని మ్యాన్ పేస్టు లో పెట్టీ హామీలు ఇచ్చి ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలు గడ్సిన గాని నేటికీ కార్మికుల తల రాతలు మారడం లేదు మేము అడిగింది ప్రభుత్వాల ఆస్తులు భూములు అడగటం లేదు గత టీ, ఆర్, ఎస్, ప్రభుత్వం కేటగిరీల వారీగా విధులు నిర్వహిస్తున్న వారిని ఒక్కరే అన్నిపనులు చేయాలని ఈ పని చేసే వారిని మల్టీ పర్పస్ వర్కర్ విధానం పేరుతో జీ, వో, నెంబర్ 51 జారీ చేసింది కావున ఈ జీ, వో, సవరించాలని ,మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, కార్మికుల కుటుంబాలను పోషించుకునే విధంగా కొంత వేతనం పెంచాలని, ఎవరి పనులు వారు చేసుకునే విధంగా మల్టీ పర్పస్ రద్దు చేయాలని ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నాం, గత టీ ఆర్ ఎస్, ప్రభుత్వం లో ఈ జీ, వో, సవరించాలని, మల్టీ పర్పస్ రద్దు చేయాలని, 2023 జూలై 07 నుండి రాష్ట్ర వ్యాప్తంగా జేఏసీ ఆధ్వర్యములో జరిగిన నిరవధిక సమ్మె కాలములో అసెంబ్లి సమావేశాలలో అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న శాసన సభ్యులు, సీతక్క మాట్లాడుతూ ఈ రోజుల్లో శానిటేషన్ పై అవార్డులు వస్తున్నాయి అంటే గ్రామ పంచాయతీ సిబ్బంది వలన ఈ రోజు అవార్డులు వస్తున్నాయి, అంటూ వారివి న్యాయమైన డిమాండ్లను తక్షణమే వారితో చర్చలు జరిపి న్యాయం చేయాలని మాట్లాడారు. శ్రీధర్ బాబు, బట్టి విక్రమార్క , పొన్నాల లక్ష్మయ్య , మరియు ప్రతిపక్ష, స్థానిక శాసన సభ్యులు మాట్లాడారు, కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 08 నెలలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి వర్యులు, సీతక్క పరిధిలోని సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాక పోవటంచాలా బాధాకరంగా ఉంది. మేమంతా పేద దళిత బడుగు బలహీన వర్గాలకు చెందిన వారము. కాబట్టే ఇప్పటికి మా సమస్యలు పరిష్కారం కావటం లేదు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన మ్యాన్ పేస్టు లో నీ హామీలు అమలు చేయాలని మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, జీ వో, నెంబర్ 51 సవరించాలని, పాత పద్ధతిలోనే కేటగిరీల వారీగా విధులు నిర్వహిస్తున్న వారికి వేతనాలు జీ వో నెంబర్ 60 ప్రకారం సవరించాలి, రెండవ పి ఆర్ సీ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత పర్మినెంట్ చేయాలని కోరుతూ, ఈ నెల 20 న జరిగే తెలంగాణ కేబినెట్ సమావేశములో గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు కీలకమైనవి కావున వెంటనే కేబినెట్ లో చర్చించి తీర్మానం చేయాలని లేని పక్షములో రానున్న రోజుల్లో విడతల వారీగా నిరసనలు చేస్తామంటూ, సమయం కేటాయించి నిరవధిక సమ్మె కైన వెళ్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం అని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జగిత్యాల జిల్లా కమిటీ కార్యదర్శి పులి మల్లేశం ఒక ప్రకటనలో తెలియ జేశారు.

## తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర ను వక్రీకరిస్తున్న బీజేపీ కు బుద్ధిచెప్పండి



మిర్యాలగూడ సెప్టెంబర్:-16 (వార్త మిర్రర్)మిర్యాలగూడ మండలంలోని గూడూరు గ్రామములో తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న పెద్దరపు లచ్చయ్య, బొంగరల కనకమ్మ, ముగల లక్ష్మమ్మ కు జరిగిన సన్మాన సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి సాయుధ పోరాట యోధులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాయుధ పోరాట చరిత్ర భూమికై.. భుక్తికై%ొ% వెట్టి చాకిరి విముక్తికై%ొ% కమ్యూనిస్టులు చేసిన త్యాగాలకు నిలువెత్తు నిదర్శనమని దోపిడీపై సాగించిన ప్రజాయుద్ధం. 'బాంచన్ దొర నీ కాల్మొక్తా' అన్న నోటితోనే 'నీ గోరి కడతా కొడకా' అంటూ కుల మతాలకు అతీతంగా సమస్త మానవాళి నాటి క్రూర పాలకులపై విరుచుకుపడ్డారని పేర్కొన్నారు.ఎర్రజెండా చేతబూని పోరుబాటలో కదం తొక్కారు. బానిస సంకెళ్లను తెంచుకుని శత్రువులను తరిమికొట్టారు. కాకులు దూరని కారడవిలో, చీమలు దూరని చిట్టడివిలో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతూ నాటి పెత్త%శీ%దారులకు ధీటుగా నిలబడ్డారని తెలిపారు . ఆ భీకరపోరులో తుపాకి పట్టి కిరాతక సైన్యంపై పోరాడిన వారు కొందరైతే%ొ% పరోక్షంగా అండగా నిలబడ్డ ధీరులు కోకొల్లలని అటువంటి చరిత్ర ను మత కోణం లో చూస్తున్న బీజేపీ కు ప్రజలు బుద్ధిచెప్పాలని వారు పిలుపునిచ్చారు..తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకు నేందుకు ఆ కిరాతక సైనికుల దౌర్జన్యంపై తెలంగాణ ప్రజలు చూపిన దీక్ష ప్రతిఘటన, పోరాట పటిమ మనలను ఉత్తేజపరుస్తాయి.ఆనాడు నైజాం ముష్కరులు, రజాకార్లు, నెహ్రూ సైన్యం జరిపిన అమానుష చిత్రహింసలను ఎదుర్కొని నిలబడితే కమ్యూనిస్టుల జాడ చెప్పమంటూ చింతబరిగెలతో ఒళ్లు చిట్లిపోయేలా కొట్టిన నాటి ప్రజలు కమ్యూనిస్టు పోరాటానికి అండగా నిలబడ్డారని తెలిపారు.అన్నింటినీ పంటి బిగువన భరిస్తూ లక్ష్యం కోసం నిలబడి . అదురూ బెదురూ లేక చేతికి చిక్కిన వాటినే ఆయుధాలుగా చేసుకున్నారు. అన్యాయంపై తిరగబడ్డారని . తమ కోసం త్యాగాలు చేస్తున్న కమ్యూనిస్టులను కడుపులో పెట్టి కాపాడుకున్నారని అటువంటి చరిత్ర ను ఈ తరానికి అందించలే కానీ మత గొడవలు కాదని వారు పేర్కొన్నారు . ప్రజా సమస్యలు పరిష్కారం చూపకుండా చోద్యం చూస్తున్న ప్రభుత్వాలను నిలదీయాల్సిన సమయమిది. రైతాంగ పోరాటంలో ఆ వీరుల పోరాటం మనకు స్పూర్తి కావాలి. హింసకు వ్యతిరేకంగా పోరాడే చైతన్యం పొందాలి. అదే వారి త్యాగాలకు మనమిచ్చే నిజమైన నివాళి అని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్,సిపిఎం సీనియర్ నాయకులు నూకల జగదీష్ చంద్ర, జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, నాయకులు బొగ్గారపు కృష్ణయ్య, శ్రీనివాస్, గోపి, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు

# వినాయక సెలవిక

### -అలరించిన శోభాయాత్ర-

### -ఘనంగా గణేష్ నిమజ్జనం



మందమర్రి సెప్టెంబర్ 16: వార్త మిర్రర్ ప్రతినిధి

పట్టణంలో మండలంలో కొలువుదీరిన గణనాథులు నవరాత్రి పూజలు అందుకొని సోమవారం నిమజ్జనానికి బయలుదేరారు. మందమర్రి సర్కిల్ పరిధిలోని మందమర్రి రామకృష్ణాపూర్ మున్సిపాలిటీలతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు 300 వినాయక మండపాలను నెలకొల్పారు. నవరాత్రులు నిష్ఠతో పూజలు అందుకున్న గణనాథులను మంచిర్యాల పట్టణంలోని గోదావరి తీరానికి నిమజ్జనానికి తరలించారు. అంతకుముందు ఆయా గణేష్ మండలి కమిటీల ఆధ్వర్యంలో వినాయక మండపాలలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నవరాత్రి పూజలు అందుకున్న గణనాథుని చేతిలోని లడ్డు,కలశం ,వివిధ పూజ వస్తువులకు వేలంపాటలు నిర్వహించగా వాటిని సొంతం చేసుకునేందుకు భక్తులు పోటాపోటీగా పోటీపడ్డారు. పోటాపోటీ వేలం పాటలతో నవరాత్రి పూజలు అందుకున్న లడ్డు, కలశం,పూజా వస్తువులను వేలంపాటలో భక్తులు దక్కించుకున్నారు. అనంతరం ఆయా మండపాలలో ప్రతిష్టించిన గణనాథులను మామిడి తోరణాలు పూలతో అలంకరించిన ప్రత్యేక వాహనంలో నిమజ్జనానికి తరలించారు.నిమజ్జనం సందర్భంగా ఆయా కాలనీలలో ప్రతిష్టించిన గణనాథులను కాలనీలలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో కోలాటాలతో,యువకులు నృత్యాలు చేస్తూ కొనసాగిన శోభాయాత్ర పలువురిని ఆకట్టుకోగా సాంప్రదాయ నృత్యాలు,టపాసుల చప్పుల్ల నడుమ గణనాథులను భక్తి శ్రద్ధలతో నిమజ్జనానికి తరలించారు. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గణనాథులకు ఘన స్వాగతం.... ....మహిళల మంగళహారతులు కోలాటాలు యువకుల కేరింతలు నృత్యాల నడుమ ప్రారంభమైన గణేష్ శోభాయాత్రకు పట్టణంలోని పాత బస్టాండ్ చౌరస్తాలో హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిమజ్జనానికి బయలుదేరిన గణనాథులకు ఘన స్వాగతం పలికారు ఈ సందర్భంగా గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జనానికి తరలించారు.గణేష్ శోభాయాత్ర,నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై రాజశేఖర్ బారి బందోబస్తు నిర్వహించారు.





# ముమ్మరంగా బిజెపి సభ్యత నమోదు

మందమర్రి సెప్టెంబర్ 16: వార్త మిర్రర్ ప్రతినిధి

భారతీయ జనతా పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సభ్యత నమోదు కార్యక్రమం పట్టణంలో ముమ్మరంగా కొనసాగుతుంది సోమవారం పట్టణంలోని యాపల్ ఏరియా 20 వ వార్డులో బిజెపి సీనియర్ నాయకులు డివి దీక్షితులు,రామటెంకి దుర్గరాజు ల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందని,నరేంద్ర మోడీ సారధ్యంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని దీమా వ్యక్తం చేశారు. దేశం కోసం ధర్మం కోసం ప్రతి ఒక్కరు బిజెపిలో చేరాలని వారు కోరారు. బిజెపి లో స్వచ్ఛందంగా చేరే వారు 8800002024 నెంబర్ కు ఫోన్ చేసి సభ్యత్వం పొందవచ్చని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివ, కొంతం రాజు,చంద్రమౌళి, సంజీవ్,అరుణ్, బాపు, రమ్య, రాజేశ్వరి,లలిత,సుమలత లు పాల్గొన్నారు



## అడ్డా బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం.

కోరుట్ల వార్త మిర్రర్ ప్రతినిధి, సెప్టెంబర్ 16.

జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని కల్వకోట గ్రామంలో శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కల్వకోట గ్రామంలో అడ్డా బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించి తరువాత అన్నప్రసాద కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలు అందరూ సంతోషంగా జరుపుకోవాలని, హిందూ ధర్మ ప్రకారం గణనాథుని మొదటగా పూజలు నిర్వహించుకోవడం మన ఆనవాయితీ అని తెలుపుతూ ప్రతి శుభకార్యంలో ముందుగా గణనాథుని కి పూజలు నిర్వహిస్తాము. వినాయకుడి ఆశీర్వాదము గ్రామ ప్రజలపై ఉండాలని అందరూ కూడా ఆరోగ్యంతో, సంతోషంగా ఉండాలని ఈ సందర్భంగా యూత్ సభ్యులు వినాయకుని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్డా బాయ్స్ యూత్ సభ్యులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# పొలాస స్టేజి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### - తాత మనుమరాలు దుర్మరణం

### - మనుమడి పరిస్థితి విషమం

### - క్షతగాత్రుల ఆసుపత్రికి తరలింపు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 16



జాతీయ రహదారి 63 పై ఘోర రోడ్డు ప్రమాదం సంభవించి తాతా, మనవరాలు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మనుమడి పరిస్థితి విషమంగా ఉండగా ఈ ప్రమాదంలోనే మరో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు రోడ్డు ప్రమాదానికి గురి కావడంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాల్లోకి వెళితే... జగిత్యాల జిల్లా పొలాస వద్ద జాతీయ రహదారి 63పై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రధాన రహదారిపై నిలిచి ఉన్న ఆర్టీసీ బస్సు వెనుక నుండి వస్తున్న యాక్టివా మోటార్ సైకిల్ పై లచ్చయ్య మూలమలుపు వద్దకు వెళ్లే క్రమంలో ప్రమాదవశాత్తు అతి వేగంగా టీఎస్ 12 యూడి 9955 ప్రైవేటు ట్రావెల్స్ బస్సు స్కూటీని ఢీ కొట్టి కొంత దూరం ఈడ్చుకెళ్లింది. ధర్మపురి నుండి రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికిచెందిన బండ్ల లచ్చయ్య (60) మనుమరాలు శ్రీనిధి (10), మనుమడు మల్లికార్జున్ (13)స్కూటీపై ప్రయాణిస్తున్న క్రమంలో బస్సు టైర్ల కింద పడ్డారు. ఇందులో తాత బండ్ల లచ్చయ్య (60), మనుమరాలు శ్రీనిధి (10) అక్కడికక్కడే మృతి చెందగా, మనుమడు మల్లికార్జున్ తీవ్ర గాయాలతో పరిస్థితి విషమంగా ఉంది. ఈ క్రమంలో అదే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు మరో మోటార్ సైకిల్ ని ఢీ కొట్టిన ఘటనలో మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులు ముగ్గురిని జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి 108 లో తరలించారు. జగిత్యాల పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు



# 21,000 రూపాయలు పలికిన శాతం రాయి వినాయకుని లడ్డు

వార్త మిర్రర్ శంషాబాద్

శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శాతం రాయి లో ఏర్పాటుచేసిన వినాయకుడి 11 రోజులు పూజలు నిర్వహించిన అనంతరం సోమవారం రోజు లడ్డూ వేలం పాటలో అదే గ్రామానికి చెందిన బండ సురేందర్ రెండోసారి లక్ష 21 వేలకు వేలంపాటలో వినాయకుని లడ్డూను దక్కించుకున్నారు అనంతరం ఊరేగింపుగా వినాయకుడిని నిమజ్జనానికి తరలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ సునీత దయానంద్, బద్రు నాయక్, గ్రామ పెద్దలు రామకృష్ణారెడ్డి జలపల్లి నరేందర్ జంగయ్య యాదయ్య బాల మల్లేష్ మల్లేష్ సాయి యాదవ్ కిరణ్ మహేందర్ ప్రభాకర్ తదితరులు కమిటీ సభ్య రాజు రమేష్ సాయి యాదవ్ కిరణ్ మహేందర్ ప్రభాకర్ ప్రవీణ్ శివ మహేందర్ అశోక్ రాము గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# వనస్థలిపురం అతిథి రెస్టారెంట్ "సాక్షి"గా బిర్యానీలో కోడి"ఈ"కలు.

**ఇదేమని ప్రశ్నించిన కస్టమర్ కు అతిథి రెస్టారెంట్ నిర్వాహకుల బెదిరింపులు**

**మమ్మల్ని ఎవ్వరు ఏమి చేయలేరు- నీ దిక్కున్న చోట చెప్పుకో పో**

**ఓ మహిళా కస్టమర్ కు నిర్వాహకుల బెదిరింపులు**

**జిహెచ్ఎంసి ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు, తనిఖీలు చేసిన అధికారులు**






ఎల్బీనగర్ 16 సెప్టెంబర్ : ఎల్బీనగర్ నియోజకవర్గం వనస్థలిపురం అతిథి రెస్టారెంట్ నిర్వాకహము మరో మారు సోమవారం బట్టబయలు అయింది. వనస్థలిపురం అతిథి రెస్టారెంట్ "సాక్షి"గా బిర్యానీలో కోడి"ఈ"కలు......!!.వనస్థలిపురం సచివాలయనగర్ అతిథి రెస్టారెంట్ బిర్యానీలో చికెన్ లెగ్ ముక్కలకు కోడి ఈకలు దర్శనమిచ్చాయి. ఈ హఠాత్పరిణామంతో కంగు తిన్న కస్టమర్ రెస్టారెంట్ నిర్వాహకులను ఇదేమిటని నిలదీశారు. దీంతో అతిథి రెస్టారెంట్ నిర్వాహకులు మహిళా కస్టమర్ పై జులుం ప్రదర్శించారు. మమ్మల్ని ఎవ్వరు ఏమి చేయలేరు- నీదిక్కున చోట చెప్పుకో పో...అనీ ఓ మహిళా కస్టమర్ కు నిర్వాహకుల బెదిరింపులకు పాల్పడ్డారని బాధితురాలు మీడియా ముందు వాపోయింది. వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోనీ సచివాలయ నగర్ అతిథి రెస్టారెంట్ లో జరిగిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనకు సంబంధించి బాధితురాలి కథనం, విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు...... ఎల్బీనగర్ నియోజకవర్గం హయత్ నగర్ కు చెందిన మేఘన తన కుటుంబ సభ్యుడితో (అన్నయ్య) కలిసి వనస్థలిపురం సచివాలయం నగర్ లోని అతిథి బిర్యాని సెంటర్ కు వెళ్ళింది. అనంతరం చికెన్ బిర్యాని ఆర్డర్ చేశారు. కొద్ది సేపటి తర్వాత బిర్యాని తీసుకు వచ్చిన రెస్టారెంట్ నిర్వాహకులు బిర్యానిలో చికెన్ లెగ్ ముక్కలకు కోడి ఈకలు రావడంతో కంగు తిన్న మొఘన యజమాని నిలదీసింది. తాము ఎంతో దూరం నుంచి అతిథి బిర్యాని సెంటర్ కు బిర్యానీ తినడానికి వస్తే కనీస జాగ్రత్తలు పాటించ కుండా కోడి ఈకలు, సరిగ్గా ఉడకని చికెన్ తో తమ ప్రాణాలు తీస్తారంటూ ఆమె ప్రశ్నించింది. ఈ హఠాత్పరిణామంతో కంగుతిన్న అతిథి బిర్యాని రెస్టారెంట్ నిర్వాహకులు కస్టమర్ల ముందు తమ రెస్టారెంట్ యొక్క బాగోతం ఎక్కడ బయట పడుతుందోనని ఏకంగా ప్రశ్నించిన కస్టమర్ మేఘనపైనే నిరుచుక పడ్డారని ఆమె వాపోయింది. జరిగిన తప్పిదానికి రెస్టారెంట్ నిర్వాహకులు పశ్చాత్తాపం వ్యక్తం చేయకుండా బెదిరింపులకు పాల్పడం ఎంత వరకు సమంజసం అని ఆమె ప్రశ్నించింది. అతిథి బిర్యాని రెస్టారెంట్ లో ఏమాత్రం కనీస భద్రతా చర్యలు, పరిశుభ్రత పాటించ కుండా రెస్టారెంట్ కు వచ్చిన కస్టమర్లపైనే బెదిరింపులకు పాల్పడటం నేడు చిన్న అంశంగా మారింది. బిర్యానీలో కోడి ఈకలు వచ్చాయని ప్రశ్నించిన తనను బెదిరింపులకు పాల్పడ్డమే కాకుండా సరైన సమాధానం చెప్పకుండా మీరు చదువుకున్న వారేనని కస్టమర్ మేఘనపై ఎదురుదాడి చేశారని, మీరు ఏమి చేసుకుంటారో చేసుకోండి మాకు కూడా పెద్దలతో పరిచయాలు ఉన్నాయని, తమని ఎవరు ఏమి చేయలేరని దుర్భాషలతో అతిథి రెస్టారెంట్ యాజమాన్యం సమాధానం ఇచ్చారని ఆమె మీడియా ముందు తన గోడు వెళ్ళబోసుకుంది. అతిథి బిర్యాని సెంటర్ నిర్వాకం సామాజిక మాధ్యమాల్లో బట్టబయలు కావడంతో జిహెచ్ఎంసి ఫుడ్ సేఫ్టీ అధికారులు బిర్యాని సెంటర్లో తనిఖీలు నిర్వహించారు.ఈ సంఘటనపై పోలీసులు, జిహెచ్ఎంసి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూద్దాం.

# వినాయకుని మెడలోకి చేరి ఆభరణంగా మారిన నాగుపాము

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 16

గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జగిత్యాల పట్టణంలో ఒక వింత సంఘటన చోటుచేసుకుంది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పూజలు అందుకుంటున్న గణపతి మెడలోకి ఒక నాగుపాము చేరి ఆభరణంగా మారింది.పట్టణంలోని వాణి నగర్ లో త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో 48 అడుగుల భారీ గణేష్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. భారీ విగ్రహంతో పాటు చిన్న గణేశుని విగ్రహాన్ని ఏర్పాటు చేసి సోమవారం ఉదయం భక్తులందరూ పూజిస్తుండగా ఒక నాగుపాము వచ్చి పూజలు అందుకుంటున్న గణపతి మెడలోకి చేరింది. శివునికి ప్రీతిపాత్రమైన సోమవారం రోజున శివుని మెడలో ఆభరణంగా ఉండే నాగుపాము ఆయన కుమారుడైన గణపతి మెడలోకి వచ్చి చేరిందంటూ భక్తులు విశేషంగా చెప్పుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాక్షాత్తూ పరమ శివుడే.. ఇక్కడకు వచ్చారని జనాలు చెప్పుకుంటున్నారు. సంభ్రమాశ్చర్యాలకు లోనైన భక్తులు పులకించిపోయి దీనిని దైవ సంకేతంగా భావిస్తున్నారు. ఇదో అద్భుతం' అని ఓ భక్తుడు అన్నారు. "నాగుపాము తనంతట తానుగా వచ్చి గణపతి మెడకు చుట్టుకుంది. అది దేవుడిచ్చిన వరం అని మేము నమ్ముతున్నాము అన్నారు.ఈ వింతను చూడటానికి ప్రజలు తండోప తండాలుగా తరలి వస్తున్నారు.గణపతి పూజలు కొనసాగుతున్నాయి అసాధారణమైన జోడింపు ఉన్నప్పటికీ,



గణపతి ఆరాధన నిరంతరాయంగా కొనసాగుతుంది. నాగుపాము ఇప్పటికీ విగ్రహం మెడకు చుట్టుకొని ఉండటంతో భక్తులు ప్రార్థనలు, పూజలు చేస్తున్నారు.



# రాజీవ్ గాంధీ విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి శేర్ నర్సారెడ్డి.

కోరుట్ల వార్త మిర్రర్ ప్రతినిధి, సెప్టెంబర్ 16.

హైదరాబాద్ లోని తెలంగాణ రాష్ట్ర సచివాలయం ఎదుట సోమవారంనాడు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని సిఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షుడు, బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, సీతక్క, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి దీపదాస్ మున్షీ, పిసిసి మాజీ అధ్యక్షులు వి. హనుమంతరావు, కేశవరావు, తదితరులతో కలిసి టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి, లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి ఇట్టి విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# అకారణంగా దాడి చేసిన ఇద్దరు యువకుల పై కేసు నమోదు

వార్త మిర్రర్ శంషాబాద్తన భర్త పై అకారణంగా దాడి చేసిన యువకులపై తగు చర్యలు తీసుకోవాలని మహిళా శంషాబాద్ పోలీసులను ఆశ్రయించిన సంఘటన. సోమవారం చోటు చేసుకుంది సర్కిల్ ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం మండల పరిధిలోని కాచారం గ్రామానికి చెందిన. శైలజ సురేష్ కుమార్ దంపతులు వారి సమీప బంధువు ఊటుపల్లి లో నివసించే రవీందర్ ఇంటికి వెళ్ళగా పాత కక్షలు నేపథ్యంలో వాళ్ల సమీప బంధువులైన కుమ్మరి అరవింద్, కుమ్మరి ప్రదీప్ సురేష్ పై దాడికి పాల్పడి ఆరుతని కారు అద్దాలను ధ్వంసం చేయడం జరిగిందని వారి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు



# సంస్థాన్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా కరంటోతు శ్రీను నాయక్

సంస్థాన్ నారాయణపూర్ సెప్టెంబర్ 16:( వార్త మిర్రర్ ) కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా కరంటోతు శ్రీను నాయక్ నియమితులయ్యారు. సోమవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి శ్రీను నాయక్ కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని సాధారణ కార్యకర్త నుండి ప్రతి ఒక్కరికీ కి అందుబాటులో ఉండి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడాలని సూచించారు. అనంతరం శీను నాయక్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి తన శాయశక్తుల కృషి చేస్తానని ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందేలా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# పుల్లెంల గ్రామంలో గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన

### - చండూరు మాజీ పిఎసిఎస్ చైర్మన్ బొబ్బల శ్రీనివాస్ రెడ్డి-స్వాతి దంపతులు.

నల్గొండ జిల్లా వార్త మిర్యాల ప్రతినిధి

చండూరు మండలం పుల్లెంల గ్రామంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఈరోజు చివరి రోజు పూజా కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ చైర్మన్ బొబ్బిలి శ్రీనివాస్ రెడ్డి, స్వాతి దంపతులు బస్టాండు వద్ద గణేష్ పూజా కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా బొబ్బల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతోటి, అష్టైశ్వర్యవంతులుగా వర్ధిల్లాలని ,విరివిగా వర్షాలు పడాలని, ఆ భగవంతున్ని వేడుకుంటూ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పుల్లెంల గ్రామంలోని యువకులు గ్రామ పెద్దలు వినాయక భక్తులు కళాకారులు కమిటీ సభ్యులు మోగుదాల నాగరాజు, సాయిరాం ముఖాల , కొల్లూరు సాయిరాం , నడి కూడా మోగుదాల నరేష్ ,నీలకంఠం నరేష్ , బాలరాజు ,సైదులు ,రవి, గోపి,అయోధ్య, గడ్డం నరసింహ,నడి కూడా , మట్టపల్లి ,పాలకూరి తదితరులు పాల్గొన్నారు.



## పాన్నారంలో అంబరాన్ని అంటిన గణేష్ శోభాయాత్ర

మందమర్రి సెప్టెంబర్ 16: వార్త మిర్రర్ ప్రతినిధి

మండలంలోని పొన్నారం గ్రామంలోని మాల కాలనిలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.నవరాత్రులు నిష్టగా పూజలు అందుకున్న గణనాథుని కి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జనానికి యటర్శించారు.అంతకు ముందు మండలం వద్ద లడ్డు, కలశం వేలం పాటలు నిర్వహించారు.అనంతరం భక్తులు కోలాటాలతో నృత్యాలతో నిర్వహించిన శోభాయాత్ర పలువురిని ఆకట్టుకుంది .ఈ కార్యక్రమంలో కాలని వాసులు పాల్గొన్నారు.



## శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ

హయత్ నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 16 హయత్ నగర్ డిపో రోడ్డు శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుడి మండపం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు, గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గొల్లూరి శివానంద్ సాగర్ మాట్లాడుతూ అన్నదానం స్వీకరించిన వారి ఆశీస్సులు అన్నదానం చేసిన వారి జీవితాల్లో సానుకూలతను తెస్తాయని అన్నారు. అజయ్ రెడ్డి మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రజల్లో భక్తి భావన పెంపొందించడానికి, గణేష్ ఉత్సవాలను భక్తి భావనతో క్రమశిక్షణతో నిర్వహిస్తున్నామని ప్రతి ఒక్కరు మహాగణపతి పూజా కార్యక్రమానికి హాజరై ఆ గణనాథుని దీవెనలు పొందాలని తెలిపారు. అన్నదాన కార్యక్రమంలో కాలనీ ప్రజలు మహిళలు చిన్నపిల్లలు భారీ సంఖ్యలో పాల్గొని అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు



## వినాయకుని లడ్డు దక్కించుకున్న. జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు అన్యపు ప్రభు..

వార్త మిర్రర్ శంషాబాద్, వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం శంషాబాద్ మండలం పెద్ద షాపూర్ గ్రామంలో అంబేద్కర్ వినాయక కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక లడ్డు వేలంపాట ఆసక్తిగా సాగింది భక్తులు లడ్డును దక్కించుకునేందుకు వేలం పాటలో పాల్గొన్నారు. వేలంపాట కాస్త నెమ్మదిగా ప్రారంభమై ఆసక్తికరంగా మారింది వినాయకుని లడ్డుని సొంతం చేసుకునేందుకు స్థానికులతో పాటు ఇతర బస్తీవాసులు పోటీపడ్డారు వేలం పాటను కొనసాగించగా వేలం తిలకించేందుకు ప్రజలు కూడ తండోపతండాలుగా తరలివచ్చారు.లడ్డు నీదా నాదా అంటూ పోటాపోటీగా సాగిన లడ్డు వేలం పాటలో చివరికి ఏఐటియుసి రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు మరియు జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ అన్యపు ప్రభు కు అదృష్టం వరించింది 69 వేల 300 వందల రూపాయలకు అన్యపు ప్రభు, లడ్డును సొంతం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తొమ్మిది రోజులు భక్తిశ్రద్ధలతో నిత్య పూజలు అందుకున్న వినాయక లడ్డు దక్కించుకున్నందుకు అన్యపు ప్రభు, సంతోషం వ్యక్తం చేశారు.అనంతరం మండపం నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులు రాచమల్ల యాదగిరి, నరేష్, రమేష్, మల్లేష్, దర్శన్,కళ్యాణ్,ఆనంద్, జైపాల్,పవన్,రాజు, శేఖర్,రమేష్, యువజన సంఘం నాయకులు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## శివాజి యూత్ ఆధ్వర్యంలో దీపారాధన ,21 రకాల నైవేద్యాలు సమర్పణ

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 16

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం శివాజి యూత్ కిష్టంపేట వారి ఆధ్వర్యంలో సోమవారం వినాయక మండపం వద్ద లోక కళ్యాణం, సంక్షేమం కోరి మహిళచే దీపారాధన , 21 రకాల నైవేద్యలతో భోగం కార్యక్రమం వేదమంతాల సాక్షిగా బ్రాహ్మణో త్తముల దీవెనతో అంగరంగ వైభవంగా సమర్పించడం జరిగింది. అనంతరం భక్తులు నిర్వహకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో శివాజీ యూత్ సభ్యులు, మహిళలు, ప్రజలు భారీ ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రతిష్టించిన ప్రాంతము లోనే మట్టి గణేషుడి నిమజ్జనం

మిర్యాలగూడ , సెప్టెంబర్ 16:-( వార్త మిర్రర్) వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మిర్యాలగూడ పట్టణంలోని స్థానిక రెడ్డి కాలనీ కోదండ రామాలయంలో ఆదర్శప్రాయంగా ఉండాలని కోదండ రామాలయంలో పెట్టిన మట్టి విగ్రహాన్ని ఆలయంలోనే అభిషేకాలు, పూజలు చేసి ఆలయంలోని ఈశాన్య మూలలో ప్రతిమను ఊరేగింపుగా తీసుకువచ్చి ఆవు పాలు, నెయ్యి, పెరుగు, పంచదార పంచామృతం పన్నీరు, కొబ్బరిబోండాలు, పసుపు కుంకుమ విభుదిలతో అభిషేకించి నిమజ్జనం చేశారు. వినాయక నవరాత్రి ఉత్సవాలలో స్థానిక రెడ్డి కాలనీ కోదండ రామాలయంలో గణేష్ నిమజ్జన కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, స్థానిక కౌన్సిలర్ దేశిడి శేఖర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు పైడిమర్ నర్సింహారావు మందడి రవీందర్రెడ్డి తాళ్ల వెంకట్ రెడ్డి, ప్రముఖ రైస్ మిల్లర్స్ రంగా శ్రీధర్, పైడిమర్రి సురేష్, ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు గార్లపాటి పండిత్రెడ్డి ఆలయ కమిటీ అధ్యక్షుడు పాదూరు ఇంద్రసేనారెడ్డి, కార్యదర్శి పుట్టా దయాకర్రెడ్డి బొజ్జ మోహన్ రెడ్డి, మోహన్ రామ్రెడ్డి, బండారు నరసింహ, నామిరెడ్డి రమేష్రెడ్డి కిషోర్రెడ్డి, పసుపులేటి రాజు, ఓరుగంటి శివ, సముద్రాల మదన్ కుమార్, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ ప్రమదగణాలకు అధిపతి అయిన వినాయకుని పూజించుకోవడం వల్ల మనం చేసే అన్ని పనులలో విఘ్నాలన్ని తొలగిపోయి వినాయకుడి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో తులతూగాలని కోరుకుంటున్నానని నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ మట్టి గణపతి పూజలు చేసి పర్యావరణాన్ని కాపాడాలని దేశ



ప్రజలందరికీ మిర్యాలగూడ నియోజకవర్గం ఆదర్శప్రాయంగా ఉండాలన్నారు. కోదండ రామాలయంలో పెట్టే గణపతి మట్టి విగ్రహాన్ని ఆలయంలోని అభిషేకాలు చేయడం చాలా బాగుందని ఇదేవిధంగా ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షిస్తూ గణపతి నిమజ్జనంలో పాల్గొనాలని ఆ విధంగా ఉండటానికి మన పట్టణంలో, పరిసర ప్రాంతాల్లో వచ్చే సంవత్సరం ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను తీసుకునే విధంగా అందరికీ చెప్పాలని అందరూ బాగుండాలి అందులో మనం ఉండాలనే నినాదంతో ముందుకు సాగాలన్నారు.



## ఉప్పల లింగస్వామి తండ్రి దశదినకర్మకు హాజరైన మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

సంస్థాన్ నారాయణపూర్ సెప్టెంబర్ 16:( వార్త మిర్రర్ ) నారాయణపురం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు ఉప్పల లింగస్వామి తండ్రి ఉప్పల పెద్దలు దశదినకర్మకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లింగస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కరెంటోతు శ్రీనివాసు నాయక్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఏపూరి సతీష్, జిల్లా నాయకులు గుత్త ప్రేమ్చందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ గుత్త ఉమాదేవి, జిల్లా ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ, గ్రామ శాఖ, మండల శాఖ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## పుల్లెంల గ్రామంలో గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన చందూరు మాజీ పిఎసిఎస్ చైర్మన్ బొబ్బల శ్రీనివాస్ రెడ్డి- స్వాతి దంపతులు

నల్గొండ జిల్లా వార్త మిర్రర్ ప్రతినిధి...చందూరు మండలం పుల్లెంల గ్రామంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఈరోజు చివరి రోజు పూజా కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ చైర్మన్ బొబ్బిలి శ్రీనివాస్ రెడ్డి, స్వాతి దంపతులు బస్టాండు వద్ద గణేష్ పూజా కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా బొబ్బల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతోటి, అష్టైశ్వర్యవంతులుగా వర్ధిల్లాలని ,విరివిగా వర్షాలు పడాలని, ఆ భగవంతున్ని వేడుకుంటూ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పుల్లెంల గ్రామంలోని యువకులు గ్రామ పెద్దలు వినాయక భక్తులు కళాకారులు కమిటీ సభ్యులు మోగుదాల నాగరాజు, సాయిరాం ముఖాల , కొల్లూరు సాయిరాం , నడి కూడా మోగుదాల నరేష్ ,నీలకంఠం నరేష్ , బాలరాజు ,సైదులు ,రవి, గోపి,అయోధ్య, గడ్డం నరసింహ,నడి కూడా , మట్టపల్లి ,పాలకూరి తదితరులు పాల్గొన్నారు.



## వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, జడ్ పి మాజి చైర్మన్ దావా వసంత సురేష్, ఎస్పై

### వందేమాతరం యూత్ ఆధ్వర్యంలో కుంకుమ పూజ అన్న ప్రసాద వితరణ

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 16జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని క్లబ్ రోడ్ యందు వందేమాతరం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపంలో నవరాత్రుల పురస్కరించుకొని కుంకుమ పూజ నిర్వహించగా ఆయురారోగ్యాలు కుటుంబ సభ్యులందరి క్షేమ ఆర్థిక వృద్ధి కోసం మహిళా మణులచే బ్రాహ్మనొత్తముల వేదమంత్రాల సాక్షిగా పూజ నిర్వహించారు.అనంతరం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మండపంలో ప్రతిష్టించిన వినాయకుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనేక సంవత్సరాలుగా ఐక్యతతో ముందుకు సాగుతూ ఆధ్యాత్మిక దైవ కార్యక్రమాల ద్వారా యువత ముందుకు వెళ్లడం అభినందనీయమని అన్నారు. స్వామి వారిని దర్శించుకుని పూజలు చేసిన తర్వాత టిఆర్ఎస్ జిల్లా నాయకులు దావా సురేష్, మాట్లాడుతూ భక్తి మార్గంలో యువతరం వెళ్లడం వలన చెడు అలవాట్లు దూరంగా ఉండి మంచి సమాజ నిర్మాణ వృద్ధి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు లింగపల్లి శంకర్, చింతకుంట రాజేష్, చిలక సత్యానంద్, బదిన పల్లి ప్రశాంత్, తోగిటి రాజ్ కుమార్, మనోజ్, శశి వర్ధన్, వరుణ్, కుంచాలు ప్రవీణ్, నాగరాజ్, వాసాల రాంప్రసాద్, మారుతి,నవీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్, మహిపాల్, శ్రీకాంత్, రాజేష్, రమేష్, ఎండీ షాకీర్, దాసరి గంగాధర్, బిఆర్ఎస్ నాయకులు తురగ శ్రీధర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.



## సమసమాజ నిర్మాణం విద్యతోనే : కె ఎల్ ఆర్ ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి.

మహేశ్వరం ప్రతినిధి వార్త మిర్రర్ సెప్టెంబర్ 16 :నాణ్యమైన విద్య అందిస్తామని తల్లిదండ్రుల్లో విశ్వాసం కలిగించినప్పుడే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు.తుక్కుగూడ కార్యాలయంలో టీచర్ల సమస్యలపై ఉపాధ్యాయ సంఘాల నేతలు కేఎల్ఆర్ ను కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బడుల్లో మౌలిక వసతులకు, స్కావెంజర్స్ నియామకానికి అనుమతులు వెంటనే ఇస్తున్నామని గుర్తు చేశారు. ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందిస్తున్నామని కేఎల్ఆర్ తెలిపారు. పదోతరగతి లోపు విద్యార్థులకు మంచి చదువు అందిస్తే విజ్ఞానంతోపాటు సంస్కారం వస్తుందన్నారు. ప్రజల మధ్య అసమానతలు తొలిగి... పేదరికం పోవాలన్నా..ఉన్నతమైన విలువలతో కూడిన జీవితం గడపాలన్నా... ఒక్క విద్యతోనే సాధ్యమన్నారు కేఎల్ఆర్. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సహా ఉపాధ్యాయ సంఘాలు పాల్గొన్నారు.

## మత సామరస్యం ప్రతీ ఒక్కరూ పాటించాలి ముస్లిం సోదరులకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు : కెఎల్ఆర్



మహేశ్వరం ప్రతినిధి వార్త మిర్రర్ సెప్టెంబర్ 16 :

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక మతాల మధ్య చిచ్చుపెట్టి ప్రజలను విడదీస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.ఇవాళ ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని మిలాద్ ఉన్ నబీగా జరుపుకోవటం విశేషమన్నారు. వారం రోజుల పాటు పలు సేవ కార్యక్రమాలు, పేదలకు పండ్లు, ఆహార పదార్థాలు పంచి ముస్లిం సోదరులు మానవత్వాన్ని చాటుకుంటున్నారని కేఎల్ఆర్ అన్నారు. వినాయక నిమజ్జనాలను సంతోషంగా జరుపుకోవాలని కే. లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. రూపాలు వేరైనా దేవుడు అందరికీ ఒక్కడే అన్నారు. కాబట్టి కలిసి అందరూ అన్ని పండుగలను జరుపుకోవాలని ప్రజలకు కేఎల్ఆర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి సహా మహేశ్వరం నియోజకవర్గం మైనార్టీ సెల్ ఛైర్మన్ షేక్ యుసూఫ్ ఖాద్రీ సహా పలువురు ముస్లిం సోదరులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్లకు సన్మానం

మిర్యాలగూడ , సెప్టెంబర్ 16:-( వార్త మిర్రర్)లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజనీర్స్ డే మహోత్సవం సోమవారం లయన్ టికెవి రంగాచార్యులు రంగనాయకమ్మల లయన్ ఐ హాస్పిటల్ లో ఇంజనీర్స్ కు సన్మానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఏనాగండ్ల లింగయ్య, కార్యదర్శి మల్లారెడ్డి, కోశాధికారి బిఎం.నాయుడు లయన్స్ క్లబ్ సభ్యులు, ఐ హాస్పిటల్ కార్యదర్శి ముఖపాటి వెంకటేశ్వర్లు మరియు లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



## ఘనంగా వినాయక శోభయాత్ర వెళ్ళిరా గననాథ సాంప్రదాయ వాయిద్యాలతో వినాయకుని నిమజ్జనం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 16

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కిష్టంపేట, రాయికల్, అల్లీపూర్ గ్రామంలో ని శ్రీ మార్కండేయ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో సాంప్రదాయ వాయిద్యాలతో ఎలాంటి శబ్ద కాలుష్యం లేకుండా ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో వినాయకుని శోభాయాత్ర నిర్వహించి నిమజ్జనం చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మహిళలు మంగళహారతులతో గణపతి పూజా కార్యక్రమంలో పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించి తదనంతరం శోభ యాత్రలో పాల్గొన్నారు. శోభయాత్ర లో మహిళలు, బాలికల కోలాట నృత్యాల మధ్య శోభయమానంగా శోభయాత్ర నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం సభ్యులు, కులపెద్దలు పాల్గొన్నారు.

# పెరుగుతున్న ప్రీమియంలపైనే దిగులు

## జీవిత బీమా పాలసీదారుల మనోగతంపై సర్వే



న్యూఢిల్లీ: పాలసీదారులకున్న ఆందోళనల్లో పెరుగుతున్న జీవిత బీమా ప్రీమియం మొత్తాలే ప్రధానమైనవని ఓ సర్వేలో తేలింది. జీవిత బీమా కొనుగోలు నిర్ణయాన్ని ముఖ్యంగా మూడు అంశాలు ప్రభావితం చేస్తున్నట్టు మంగళవారం విడుదలైన ఈ సర్వే నివేదిక పేర్కొన్నది. అవసరాలు, ఆర్థిక పరిమితులు, స్థోమతల ఆధారంగా జీవిత బీమాపై పాలసీదారులు ఓ నిర్ణయానికి వస్తున్నట్టు హన్సా రిసెర్చ్ తెలిపింది. దేశవ్యాప్తంగా దాదాపు 3,300 మంది జీవిత బీమా పాలసీదారుల అభిప్రాయాలను సేకరించి ఈ నివేదికను హన్సా తయారు చేసింది. కాగా, ఏ సంస్థలోనైతే బీమాను తీసుకున్నామో.. ఆ కంపెనీ సహకరించకపోవడం వల్ల కూడా పాలసీలను కొనసాగించలేకపోతున్నట్టు 22 శాతం మంది చెప్పడం గమనార్హం. ఇక ప్రతీ 10 మంది పాలసీదారుల్లో 8 మంది కనీసం 6 నెలలకోసారైనా బీమాను కొన్న తర్వాత తమ ఏజెంట్‌ను కలుసుకోవాలని కోరుకుంటున్నారు. డిజిటల్, ఆన్‌లైన్ విధానాలపై పాలసీదారుల్లో ఉన్న అవగాహన రాహిత్యం కూడా జీవిత బీమా కొనుగోళ్లలో ప్రధాన అడ్డంకిగా మారుతున్నది. మొత్తానికి బీమా పాలసీల ప్రీమియంలు అందుబాటు ధరల్లో ఉండాలని మెజారిటీ ప్రజానీకం కోరుకుంటున్నట్టు తాజా సర్వే స్పష్టం చేసింది.

### ఐఆర్డీఏఐ నిర్ణయంపై హర్షం

జీవిత బీమా పాలసీలపై తీసుకున్న రుణాల చెల్లింపులను క్రెడిట్ కార్డుల ద్వారా చేయడాన్ని ఐఆర్డీఏఐ నిషేధించడంపట్ల బీమా కంపెనీలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నిర్ణయం వల్ల పాలసీదారులు అప్పుల ఊబిలో కూరుకుపోకుండా ఉంటారని అభిప్రాయపడ్డాయి. బీమా రంగ రెగ్యులేటర్ ఐఆర్డీఏఐ ఇటీవల.. బీమా పాలసీలపై తీసుకున్న రుణాలకు సంబంధించి పాలసీదారులు క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లిస్తే అంగీకరించవద్దని ఆదేశించిన విషయం తెలిసిందే.

# గ్లోబల్ మార్కెట్లోకి పొకో ఎఫ్5 ప్రో.. ఇవీ స్పెషిఫికేషన్స్..!




ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ పొకో.. తన ఎఫ్ సిరీస్ 'పొకో ఎఫ్5 ప్రో 5జీ ఫోన్‌ను గ్లోబల్ మార్కెట్లో ఆవిష్కరించింది. ఒక్టాకోర్ క్వాల్ కామ్ స్నాప్ డ్రాగన్ 8ం జెన్ 1 ఎస్వోసీ ప్రాసెసర్, 120 హెర్ట్జ్ అమోలెడ్ డిస్ ప్లే విత్ సపోర్ట్ ఫర్ డోల్బీ విజన్ టెక్నాలజీతో వస్తున్నది. ఈ ఫోన్ ట్రిపుల్ రేర్ కెమెరా యూనిట్ కలిగి ఉంటుంది. 5160 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీ విత్ సపోర్ట్ 67 వాట్ల వైర్డ్ టర్బో చార్జింగ్ అండ్ 30 వాట్ల వైర్ లెస్ చార్జింగ్ తో వస్తుంది. పొకో ఎఫ్5 ప్రో 5జీ ఫోన్ 8జీబీ రామ్ విత్ 256 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ వేరియంట్ దాదాపు రూ.36,000 (449 డాలర్లు) పలుకుతుంది. 12 జీబీ రామ్ విత్ 256 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ వేరియంట్ సుమారు రూ.41,000 (499 డాలర్లు), టాప్ ఎండ్ మోడల్ 12 జీబీ రామ్ విత్ 512 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ వేరియంట్ ఫోన్ సుమారుగా రూ.45 వేలు (549 డాలర్లు) పలుకుతుంది. గ్లోబల్ మార్కెట్లో ఎర్లీ బర్డ్ ఆఫర్ కింద ఈ ఫోన్లు 429 డాలర్లు, 449 డాలర్లు, 499 డాలర్లకు లభిస్తాయి. బ్లాక్, వైట్ కలర్ ఆప్షన్లలో ఈ ఫోన్ లభిస్తుంది. ఈ ఫోన్‌ను భారత్ మార్కెట్లో ఎప్పుడు ఆవిష్కరిస్తారన్న సంగతి వెల్లడించలేదు. అయితే, పొకో ఎఫ్5 5జీ ఫోన్ ఇప్పటికే భారత్ మార్కెట్లోకి వచ్చేసింది. 8జీబీ రామ్ విత్ 256 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ వేరియంట్ ధర రూ.29,999 పలుకుతున్నది.

### ఇవీ పొకో ఎఫ్5 ప్రో 5జీ స్పెషిఫికేషన్లు

పొకో ఎఫ్5 5జీ ఫోన్‌లో మాదిరిగానే పొకో ఎఫ్5 ప్రో 5జీ ఫోన్‌లో కూడా సిమ్, సాఫ్ట్ వేర్, డిస్ ప్లే స్పెషిఫికేషన్లు ఉంటాయి. డ్యుయల్ (సిమ్) పొకో ఎఫ్5 ప్రో 5జీ ఫోన్ ఆండ్రాయిడ్ 13 బేస్డ్ ఎంఐయూఐ 14 వర్షన్‌పై పని చేస్తుంది. 6.67-అంగుళాల డబ్ల్యూక్యూహెచ్ డీ ం (1,440ఐ3,200 పిక్సెల్స్) ఫ్లో అమోలెడ్ డిస్ ప్లే విత్ 120 హెర్ట్జ్ రీఫ్రెష్ రేట్‌తో వస్తున్నది. 240 హెర్ట్జ్ టచ్ శాంప్లింగ్ రేట్, 1400 నిట్స్ పీక్ బ్రైట్ నెస్ కలిగి ఉంటది. పొకో ఎఫ్5 5జీ ఫోన్ ట్రిపుల్ రేర్ కెమెరా యూనిట్ తో వస్తున్నది. 64-మెగా పిక్సెల్ సెన్సర్, 8-మెగా పిక్సెల్ సెన్సర్ విత్ అల్ట్రా వైడ్ లెన్స్, 2-మెగా పిక్సెల్ సెన్సర్ విత్ మాక్రో లెన్స్ కెమెరాలు ఉంటాయి. సెల్ఫీల కోసం 16-మెగా పిక్సెల్ కెమెరా సెన్సర్ ఉంటుంది. పొకో ఎఫ్5 5జీ ఫోన్ మాదిరిగానే కనెక్టివిటీ ఆప్షన్లు ఉంటాయి.

# 200 కోట్లతో జడ్చర్ల ప్లాంట్ విస్తరణ

## ఈటో ఎండీ పవన్ చావలి




హైదరాబాద్: రాష్ట్రానికి చెందిన విద్యుత్ ఆటోల తయారీ సంస్థ 'ఈటో' టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నది. దేశీయంగా ఈ ఆటోలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని వచ్చే ఏడాది 10 వేల యూనిట్ల వాహనాలను విక్రయించాలని లక్ష్యం గా పెట్టుకున్నది. ఇందుకోసం జడ్చర్ల వద్ద ఉన్న ప్లాంట్ సామర్థ్యాన్ని రెండింతలు పెంచడానికి రూ.200 కోట్ల మేర పెట్టుబడి పెట్టనున్నట్టు ఈటో మేనేజింగ్ డైరెక్టర్ పవన్ చావలి తెలిపారు. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 1,500 యూనిట్ల ఆటోలను విక్రయించిన సంస్థ..వీటిలో హైదరాబాద్ రోడ్లపైన 300 వరకు వాహనాలు దూసుకుపోతున్నాయి. ప్రస్తుతం ఈ యూనిట్‌లో నెలకు 300 నుంచి 400 వాహనాలు ఉత్పత్తి అవుతున్నాయి.

### మరో రెండు వాహనాలు

వచ్చే ఏడాదిలోగా మరో రెండు వాహనాలను విడుదల చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. దీంట్లో ఏడు సీట్ల కెపాసిటీ కలిగిన ఈ-ఆటోతోపాటు మినీ బస్సు కూడా ఉన్నది. ప్రస్తుతం సంస్థ రూ.3.5 లక్షలు మొదలుకొని రూ.4 లక్షల లోపు ధర కలిగిన ఆటోలను దేశీయంగా విక్రయిస్తున్నది. మరోవైపు, మహిళా సాధికారిత లక్ష్యంగా సంస్థ కీలక నిర్ణయం తీసుకున్నది. మహిళలకు ఉపాధి కల్పించడమే ప్రధాన ధ్యేయంగా హైదరాబాద్‌లో 200 మందికి పైగా మహిళలకు ఈ-ఆటోలు నడపడంపై ప్రత్యేకంగా శిక్షణ కూడా ఇస్తున్నట్టు చెప్పారు. త్వరలో వీరు డ్రైవింగ్ లైసెన్స్ పొంది హైదరాబాద్‌లో ఈ ఆటోలు నడపనున్నారు. ఇప్పటికే ఇలాంటి కార్యక్రమంగా గుజరాత్‌లో చేపట్టింది.

### తెలంగాణ ఈవీ పాలసీ భేష్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈవీ పాలసీ భేషుగ్గావున్నదని పవన్ వెల్లడించారు. ఇప్పటికే ఇక్కడ దేశీయ, అంతర్జాతీయ సంస్థలు తమ యూనిట్లను నెలకొల్పుతున్నాయని, ముఖ్యంగా ప్రత్యేక క్లస్టర్‌లో వాహనాలు ఉత్పత్తి అవుతున్నాయన్నారు. కాలుష్య ఉద్గారాలను తగ్గించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఆశాజనకంగా ఉన్నాయని చెప్పారు.

# దివాళా ప్రక్రియలో గో ఎయిర్.. స్లాట్స్‌పై టాటా.. ఇండిగో ఫోకస్!




నిధుల కొరతతో స్వచ్ఛంద దివాళా పరిష్కార ప్రక్రియ పిటిషన్ దాఖలు చేసిన ఎయిర్ లైన్స్ 'గోఫస్ట్' ఆస్తులు, లీజ్ హక్కులను సొంతం చేసుకునేందుకు టాటా సన్స్ ఆధీనంలోని ఎయిర్ ఇండియా, ఇండిగో ఎయిర్ లైన్స్ సంప్రదింపులు జరుపుతున్నాయి. దివాళా పరిష్కార ప్రక్రియ కోసం పిటిషన్ వేసినందున టికెట్ల విక్రయాలు నిలిపేయాలని గోఫస్ట్ యాజమాన్యాన్ని డీజీసీఏ ఆదేశించిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించేందుకు గో ఎయిర్, ఎయిర్ ఇండియా ప్రతినిధులు అందుబాటులోకి రాలేదు. ఇండిగో అధికార ప్రతినిధి కూడా ఊహాగానాలపై స్పందించబోమని స్పష్టం చేశారు. గో ఎయిర్ లైన్స్ లెజర్స్‌తో టాటా గ్రూప్, ఇండిగో యాజమాన్యాలు వేర్వేరుగా సంప్రదింపులు జరుపుతున్నాయని. గోఫస్ట్ విమానయాన సంస్థకు న్యూఢిల్లీ, ముంబైతోపాటు వివిధ ఎయిర్ పోర్ట్ ఆపరేటర్ల వద్ద గల ల్యాండింగ్, పార్కింగ్ స్లాట్స్ కోసం ఈ రెండు సంస్థల ప్రతినిధులు సంప్రదిస్తున్నట్లు తెలిసింది. గో ఎయిర్ లైన్స్ లెజర్స్ తమ 36 విమానాలను తిరిగి స్వాధీనం చేయాలని డీజీసీఏ వద్ద ఫైలింగ్ చేయనున్నాయి. వివిధ విమానాశ్రయాల్లో గోఫస్ట్ స్లాట్లను సొంతం చేసుకోవడానికి టాటా ఎయిర్‌ఇండియాతోపాటు న్యూ ఎయిర్ లైన్స్ ఆకాశ ఎయిర్ కూడా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. గోఫస్ట్ విమానయాన సంస్థ రుణాల పునర్వ్యవస్థీకరణకు యత్నం, సర్వీసుల పునరుద్ధరణ సంక్లిష్టంగా మారాయన్న అభిప్రాయాల నేపథ్యంలో టికెట్ల విక్రయాలు నిలిపేయాలని ఆ సంస్థ యాజమాన్యాన్ని డీజీసీఏ ఆదేశించింది. గో ఎయిర్ విమానాల నిర్వహణకు ఆపరేటింగ్ లైసెన్స్ కొనసాగిస్తుందా.. లేదా? అన్న సంగతి రెండు వారాల్లో తేలనున్నది. గో ఎయిర్ సంస్థకు స్కై హై ఎక్స్ సీవీ లీజింగ్, ఏసీసీ ఎయిర్ క్రాఫ్ట్ లీజింగ్ ఐర్లాండ్, ఎస్ఎంబీసీ ఏవియేషన్ క్యాపిటల్ సంస్థలు ప్రధాన లీజుదారులుగా ఉన్నారు. 2005లో నుస్లీ వాడియా.. గో ఎయిర్ విమానయాన సంస్థను స్థాపించారు. తమ సంస్థ విమానాల్లో వాడుతున్న ప్రాట్ అండ్ విట్నీ ఇంజిన్లు ఊహించిన దానికన్నా వేగంగా దెబ్బ తింటున్నాయని, ముందస్తుగానే మూలన పడుతున్నాయని గో ఎయిర్ తెలిపింది. 2016 నుంచి గత ఫిబ్రవరి వరకు 500కి పైగా ప్రాట్ జీటీఎఫ్ ఇంజిన్లు రీప్లేస్ చేయాల్సి ఉందన్నారు. ఇంజిన్లు అందుబాటులో లేక విమాన సర్వీసులు నిలిపేయడంతో రూ. 10,800 కోట్ల నష్టాల్లో కూరుకున్నది. విడి భాగాల సరఫరాలో అంతరాయం, నూతన వాణిజ్య జెట్ లైనర్ విమానాల కొరతతో మరోసారి గో ఎయిర్ కష్టాలు వెలుగు చూశాయి. గతేడాది కేంద్రం నుంచి ఎయిర్ ఇండియాను స్వాధీనం చేసుకున్న టాటా.. మహారాజకు పూర్వ వైభవం తేవడానికి, విమాన సర్వీసులు పెంచడానికి చర్యలు చేపడుతున్నది. ఇటీవలే ఎయిర్ బస్, బోయింగ్ సంస్థలతో 470 విమానాల కొనుగోలుకు ఒప్పందాలు కుదుర్చుకున్నది. బడ్జెట్ ఆపరేటర్ ఇండిగో మార్చిలో దేశీయంగా 73 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చింది. దేశీయ విమానయాన మార్కెట్లో ఇండిగో దాదాపు 60 శాతం వాటా కలిగి ఉంది.



## తెలంగాణలో టర్క్ మోటర్స్

హైదరాబాద్:దేశంలో తొలి ఎలక్ట్రిక్ మోటర్‌సైకిల్ తయారీ సంస్థ టర్క్ మోటర్స్..తాజాగా తెలంగాణలోకి ప్రవేశించింది. హైదరాబాద్‌లో తన తొలి అవుట్‌లెట్‌ను కూకట్‌పల్లిలో మంగళవారం ప్రారంభించింది. 2 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ అవుట్‌లెట్‌లో అన్ని రకాల బైకులను అందుబాటులో ఉంచినట్టు కంపెనీ ఫౌండర్, సీఈవో కపిల్ శేల్క్ తెలిపారు. క్రటోస్ ఆర్ మాడల్ ధర రూ.1,68,374గా నిర్ణయించింది.



## పెన్నార్‌కు 682 కోట్ల ఆర్డర్

హైదరాబాద్:పెన్నార్‌కు మరో రూ.682 కోట్ల విలువైన ఆర్డర్లు ఆకట్టుకోగలిగింది. ఈ ఆర్డర్లు టాటా స్టీల్, హిందుస్థాన్ కోకాకోలా, ఏపీఐ స్కాడ్ ప్రాసెసింగ్, జిమ్ ల్యాబోల నుంచి వచ్చాయని పేర్కొంది. అలాగే రైల్వే వర్టికల్‌కు ఐసీఎఫ్, రైట్స్, ఒరియంటల్, ఎస్‌సీఆర్, ఈసీఆర్‌ల నుంచి ఆర్డర్లు వచ్చాయని వెల్లడించింది.



## ఎస్‌సీఆర్‌కి 465 కోట్ల ఆదాయం

హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే(ఎస్‌సీఆర్) అంచనాలకుమించి రాణిస్తున్నది. గత నెలలో ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా రూ.465.38 కోట్ల ఆదాయం సమకూరినట్టు రైల్వే అధికారులు తెలిపారు. ఒక నెలలో ఇంతటి స్థాయిలో ఆదాయం రావడం ఇదే తొలిసారని రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు. ఏప్రిల్ 2023లో 2.19 కోట్ల మంది ప్రయాణికులు రైల్వేను వినియోగించుకున్నారు. క్రితం ఏడాది ఇదే నెలలో 1.72 కోట్ల మంది ప్రయాణికులతో పోలిస్తే 27.10 శాతం అధికమని పేర్కొంది. రోజు నడిచే రైళ్లతోపాటు 65 ప్రత్యేక రైళ్లు ప్రవేశపెట్టడం కూడా ఆదాయం పెరగడానికి దోహదం చేసినట్టు తెలిపారు. అలాగే 11.298 మెట్రిక్ టన్నుల సరుకు రవాణా చేసింది. తద్వారా రూ.1,106 కోట్ల ఆదాయం ఆర్జించింది.




## భారత్‌లో బెస్ట్ సెల్లింగ్ కారు మారుతి వ్యాగన్-ఆర్..!

కరోనాకు ముందుతో పోలిస్తే.. తర్వాతీ కాలంలో ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ పర్సనల్ మొబిలిటీకి ప్రాధాన్యం ఇస్తున్నారు. సాధ్యమైనంత మేరకు స్పేసియస్‌గా, ఎక్కువ మంది ప్రయాణించడానికి వీలుగా ఉండే ఎస్‌యూవీ కార్ల కొనుగోళ్లకు మొగ్గుతున్నారు. గతేడాది 2022లో అమెరికన్లు ఫోర్డ్ ఎఫ్ సిరీస్ ఎస్ యూవీ కార్లపై మోజు పెంచుకున్నా.. తర్వాత ఇండియాలో బెస్ట్ సెల్లింగ్ కారుగా మన మారుతి వ్యాగన్-ఆర్ నిలిచింది. భారత్ మొదలు అగ్రరాజ్యం అమెరికా, బ్రిటన్, చైనా, జర్మనీ దేశాల్లో అత్యధికంగా అమ్ముడైన కార్ల వివరాలు తెలుసుకుందామా.. !

### ఫోర్డ్ 'సీ' సిరీస్ కార్లపైనే అమెరికన్ల మోజు

అగ్రరాజ్యం అమెరికాలో ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కార్ల తయారీ సంస్థ ఫోర్డ్.. ఎఫ్ సిరీస్ కార్లపై అమెరికన్లు మనస్సు పారేసుకున్నారు. 2022లో అత్యధికంగా ఫోర్డ్ 'ఎఫ్' సిరీస్ కార్లు సొంతం చేసుకున్నారు. 2021తో పోలిస్తే గతేడాది (2022)లో 9,08,921 కార్లు అమ్ముడయ్యాయి. 2021లో 8,94,757 కార్లు సేల్ అయ్యాయి. 2022లో ఎస్‌యూవీ కార్లు 8,61,256 అమ్ముడు పోయాయి.